
# సత్సంగము



సంకలనము

**తూములూరు కృష్ణమూర్తి**

# సత్సంగము

"సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం, నిశ్చలతత్వే జీవన్ముక్తి:'

*శంకరాచార్య.*

## అరిషడ్వర్గములు

శ్లో॥ ధ్యాయతో విషయాన్ పుంస: సంగస్తేషూప జాయతే
సంగాత్ సంజాయతే కామ: కామాత్ క్రోధాభిజాయతే

శ్లో॥ క్రోధాత్ భవతి సమ్మోహ: సమ్మోహాత్ స్మృతి విభ్రమ:
స్మృతి భ్రంశాత్ బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి

శ్లో॥ విహాయ కామాన్య స్సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహ:
నిర్మమో నిరహంకార: స్సశాన్తి మధిగచ్ఛతి

*(భ.గీ.పు. 2-62, 63, 71)*

### 1. అరిషడ్వర్గములలో మొట్టమొదటివి - కామక్రోధములు

మానవునకు కామ, క్రోధములు అని రెండు పదములు ఉండినప్పటికిని మొదటి పదము యొక్క పరిణామమే రెండవ పదము లోభ, మోహ, మద, మాత్సర్యములు మొదటి పదము యొక్క పరిణామములే. అరిషడ్వర్గములనగా కామము యొక్క పరిణామము. కామము యొక్క పరివర్తనే వీటియొక్క స్వరూప స్వభావములకు మూలకారణము. కామము వల్ల ఆపేక్ష పెరుగుచున్నది. ఈ ఆపేక్ష ఫలించకుండిన అనగా విఫలమైనచో అది క్రోధముగా మారుచున్నది. ఈ క్రోధమే సమ్మోహనంగా తిరుగుచున్నది. ఈ సమ్మోహనమే కడపటికి పెరిగి పెరిగి స్మృతిభ్రష్టుని గావించుచున్నది. ఈ స్మృతి భ్రష్టుడే కష్టము వల్ల బుద్ధి క్షీణత పొందుచున్నాడు. ఈ బుద్ధి నాశనము వలన సర్వమూ నాశనమగుచున్నది. సర్వ దు:ఖములకు సర్వ నాశనమునకు, అపకీర్తికి ఈ కామవే మూలకారణము. మనము వాంఛలను తగినంత అదుపులో ఉంచుకొని తగినరీతిగా జీవించడానికి ప్రయత్నించాలి.

సర్పమింటియందు సంచరించుచుండ
ఎవరు సుఖనిద్ర చెందగలరు?
విషయసర్ప ముండు విషమయ దేహాన
జీవయాత్ర దేహి సల్పుచుండ
కోపము కలిగిన వానికి
ఏపనియు ఫలింపకుండ ఎగ్గులు కలుగునో
పాపము పనులనే చేయుచు
ఛీ పొమ్మనిపించు కొనుట చేకూరును సుమీ.
సాధనలు చేసి ఫలమేమి శమము లేక
యోగములు పూని ఫలమేమి ఓర్పులేక
జపము లొనరించి ఫలమేమి శాంతి లేక
చవిటి భూమిని దున్నిన సరళి కాదె

విషయములు ధ్యానించు వానికి వాటియందు ఆసక్తి కలుగును. అట్టి విషయాసక్తి వలన **కోరిక, కోరిక వలన కోపము కలుగును. కోపము వలన అవివేకము, అవివేకము వలన స్మరణ భ్రంశము కలుగును. స్మరణ జ్ఞానముపోవుట వలన బుద్ధి నశించును. బుద్ధి నశించిన తోడనే తానే నశించును కాన, విషయచింతన యుండరాదు**. ఎవడు సమస్త కోరికలను, శబ్దాది విషయములను త్యజించి వాని యం దేమాత్రము ఆశ లేక, అహంకార మమకార వర్జితుడై ప్రవర్తించునో అట్టివాడే శాంతిని పొందుచున్నాడు.

కోరు కోరికలన్నియు తీరుచున్న
భక్తి దైవమున హెచ్చు, రక్తి హెచ్చు
కోరు కోరిక లెవ్వేని తీరకున్న
భక్తి తరుగుచు, దైవ విరక్తి పెరుగు. *(శ్రీ.భ.ఉ.పు. 12/13)*

విషయ చింతన అనర్థమునకు దారితీయును. శత్రువు మిత్రుని వలె నటించి మెల్లగా లోన ప్రవేశించును. కొద్దిచోటును మాత్రమే అర్థించి క్రమ క్రమముగా విస్తరించి తుదకు తనకు చోటిచ్చిన వానిని హతమార్చును.

విషయ భావన స్వల్పముగ మనస్సున ప్రవేశించి అదియే పెరిగి పెరిగి మనుజుని అధోగతికి త్రోసివేయును.

## 2. **కామము** (కామమంటే కోరిక)

కామశక్తియే అధికమీ కాలమందు
వాని మిత్రుడు క్రోధుడు వారిరువురు
చేర్చుకొనునట్టి జనునకు చేటుకల్గు
సత్యమును చూపు బాట యీ సాయి మాట॥ *(సా.పు 220)*

చిత్రకూట పర్వతం మీద ఉన్నప్పుడు శూర్పణఖ రావటం లక్ష్మణుడు ముక్కు, చెవులు కోయటం, రావణునితో చెప్పి సీతను లంకకు తీసుకురావటానికి కారణం అయింది శూర్పణఖ. రామాయణంలో మంథర, శూర్పణఖ పేర్లు కొన్ని లైన్లలో మాత్రమే చూపినారు కాని అంతకంటె ఎక్కువ చెప్పలేదు. ఇంత చిన్న శూర్పణఖ, మంథరల ద్వారానే రామాయణమంతా జరిగింది. అయోధ్యలో రాముడు అరణ్యానికి పోవటం, అరణ్యంలో సీత లంకను చేరటానికి ఈ శూర్పణఖ, మంథర కార్యకర్తలుగా అంటున్నారు. ఇంతకీ వీరెవరు? **శూర్పణఖ కామము, మంథర క్రోధము**. వీరిరువురే మనజీవిత రామాయణానికి కారకులు. అయితే వీనిని జయించుట యెట్లా? అని నిరాశపడనక్కరలేదు.

సర్వవిధములైన వాంఛలు భగవద్భావంతో అనుభవించుటతో కొంత ఆనందం కలుగుతుంది. ప్రకృతిని విశ్వసించి పరమాత్మని వేరు చేసినపుడు ఆనందం అందుకోలేము. కామత్యాగాన్ని రామాయణం మనకు నిరూపణ చేసింది. సర్వ సుఖములు త్యజించి సీత కామమును త్యాగము చేయుటచే రామునితో పోవటానికి అవకాశం కలిగింది. తిరిగి త్యాగము కామముగా మారింది. మధ్యలో బంగారులేడిపై కామం కలిగింది. అపుడు రాముడు దూరమైపోయినాడు. ఇట్టి పవిత్ర అంతరార్థాన్ని బోధించింది రామాయణంకాని, అది ఏదో ఫ్యామిలీ ఫైట్ కాదు. ఉపనిషత్తులు, రామాయణం, భారత భాగవతాలు పవిత్రమైన అంతరార్థాన్ని బోధిస్తున్నాయి.

**కామమనే పిశాచము నశించగానే ప్రేమ అనే దేవత ఉద్భవించుతుంది.**
*(శ్రీ.స.ది.వీ.పు.22)*

## 3. కామక్రోధ లోభములు - పరమశత్రువులు

**(క్రోధమనగా కోపము, పగ)**

రామాయణంలో రావణుడెంత గొప్పవాడు! అరువదినాల్గు విద్యలను అభ్యసించాడు. కఠోర తపస్సును ఆచరించి దైవానుగ్రహాన్ని పొందాడు. అంతటి గొప్ప వ్యక్తి ఒక్క కామానికి లోనుకావడంచేత సర్వమును నాశనం గావించుకున్నాడు. ఇంక భాగవతంలో హిరణ్యకశిపుడు కూడా చాలా గొప్పవాడే. అతడు పంచభూతములను అదుపులో పెట్టుకున్నాడు. కానీ క్రోధాన్ని మాత్రం జయించలేకపోయాడు. కోపము కలిగినవానికి

ఏ పనియు ఫలించకుండు ఎగ్గులు కలుగున్
ఛీ, పొమ్మనిపించుకొనుట చేకూరు సుమీ!
తన కలిమి భంగపుచ్చును
తనకుంగల గౌరవంబు దగ్ధము చేయున్
తనవారల కెడ సేయును
జనులకు కోపము వలన సర్వము చెడున్
ఇంక, భారతంలో దుర్యోధనుడు పరమలోభి
లోభివానిని చంప లోకంబు లోపల
కొట్టవద్దు, వానిని తిట్టవద్దు
డబ్బు అడిగినంత దబ్బున తా వచ్చు

ఇలాంటి **లోభియైన దుర్యోధనుడు కడపటికి సాధించినదేమిటి? కనుక కామ క్రోధ లోభములు మూడూ సాధకునకు పరమ శత్రువులు.** ఎన్నో సంవత్సరాలు చేసిన సాధన ఒక్కతూరి కోపం రావడం వల్ల నాశనమైపోతుంది. విశ్వామిత్రుడు గొప్ప తపస్సంపన్నుడు. అనేక అస్త్ర శస్త్రములను సాధించినవాడు. అలాంటివాడు భగవద్భక్తుడై వశిష్ఠుల వారిపై క్రోధం పూనాడు. వశిష్ఠులవారు నిరంతరం బ్రహ్మతత్వాన్ని చింతించేవాడు. కాబట్టి ఆయనకు బ్రహ్మర్షి అనే బిరుదు వచ్చింది. విశ్వామిత్రుడు రజోగుణంతో కూడిన వాడు కనుక, అతనిని రాజర్షి అన్నారు. విశ్వామిత్రుడు తాను కూడా బ్రహ్మర్షి అనిపించుకోవాలని పట్టుబట్టాడు. గొప్ప తపస్సు చేశాడు. కానీ వశిష్ఠుల వారిపై క్రోధం పూనటం

చేత సర్వశక్తులూ కోల్పోయాడు. *(స.సా.ఏ. 99 పు. 99)*

## ధర్మము

మానవుడు తనలోని అరిషడ్వర్గము (కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యము) లనే పశువులను సంహరించి తన పరిశుద్ధాత్మను విశ్వేశ్వరునకు సమర్పించుట అనేది ధర్మము. *(ధ.పు 4)*

పండులావుండు, చేదుగా యున్న దాని తోలును తీసి పారవెయ్యి, లోపల తియ్యటి రసాన్ని త్రాగి అనుభవించు, అరిషడ్వర్గాలు అనే తోలును తీసిన తరువాత మిగిలేది నేనే. తియ్యటి రసమే నేనన్న ప్రేమ రూపుడను. త్రాగి అనుభవించు. *(సా. పు. 469)*

## 4. లోభము (లోభమంటే పిసినితనము, అధికాశ )

నాస్తి లోభ సమో వ్యాధి:
నాస్తి క్రోధ రసమో రిపు:
నాస్తి దారిద్ర్యవ దు:ఖం
నాస్తి జ్ఞాన సమో సుఖం

ఈ ప్రపంచంలో లోభము కంటే మరొకటి లేదు. ఈ జగత్తునందు క్రోధము కంటే మరొక శత్రువు లేదు. దారిద్ర్యము కంటే మరొక దు:ఖము లేదు. జ్ఞానము కంటే మరొక సుఖము లేదు *(భ మ. పు 105)*

సౌఖ్యమనుభవించజాలని లోభికి!
ఎంత కలిమి యున్న ఏమి ఫలము
నీరు గతుకు కుక్క ఏరెంత పారిన!
ప్రీతి చెద బోడు పిసినిగొట్టు !! *(సా. పు 169)*

## 5. మోహము

**(మోహమంటే. అజ్ఞానము, అవివేకము, చిత్త వైకల్యము, విపరీతజ్ఞానము)**

అర్జునుడనగా స్వచ్ఛమయిన స్వభావము కలవాడు! సమయ సందర్భములను యోచించక ఈ ఏడుపు ఏమిటి? యుద్ధమా కుత్తుకపై

కూర్చొన్నది. యుద్ధమేఘములు దట్టమైన స్వరూపమును ధరించి ప్రతిధ్వనించుచు చుట్టుముట్టుచున్నవి. యెదుట నిలచిన శత్రువులా! యెప్పుడా అని వుర్రూతలూగుచున్నారు. వారు యింతవరకూ మీపై చూపిన అన్యాయ, అక్రమ, అనాచారములా లెక్కలేనన్ని, అంతమాత్రముతో పోక ధర్మరీతిగా మీకు రావలసిన రాజ్యమును కూడా మ్రింగివేయుటకు సిద్ధముగా నున్నారు.

ఇంతవరకూ మీరు సత్యనిష్ఠ వైదొలగక అనేక కష్టాలపాలైతిరి. వారిచ్చిన నియమములు, సమయములు కూడనూ గడిపితిరి. కడకు రాజీ ప్రయత్నములా వేరుగా చెప్పనక్కరలేదు. ఎంతవరకు చూడవలెనో అంతవరకూ చూచితిమి. అన్నియూ నిష్ఫలమాయెను. అధర్మమార్గ, దురహంకార, దురాచారశీలుడైన దుర్యోధనుని కన్నులు తెరిపించవలెనన్న ఒక్క యుద్ధము తప్ప వేరు మార్గము లేదు. ఇది నేటి సంకల్పము కాదు! దీనికి పూర్వము పెద్దలందరూ చేరి అన్ని విషయములూ యోచించి యుద్ధమనివార్యమని నిర్ణయించిరి. మీ సోదరులను, నీవును అందులకు సమ్మతించి మంచిదని ఒప్పుకొంటిరి. ఆనాటినుండి యుద్ధమునకుతగిన ప్రయత్నములన్నియూ జరుపుచునే యున్నారు. నీవునూ అందులోనే మునిగి యుంటివి. యుద్ధమునకు సిద్ధమని, ఈనాడు వెనుకంజ వేయుటకు యేమిటి ఈ పిరికితనము? ఈ యుద్ధము హఠాత్తుగా వచ్చిపడినదికాదే! కావలసిన సామగ్రి ఎంతో కాలమునుండి సేకరించితివే! ఆనాడు కాయలు, కసురులు తిని కైలాసనాథుని మెప్పించి పాశుపతాస్త్రాన్ని సంపాదించితివి. దేవేంద్రలోకమునకు పోయి వారి మెప్పుల కుప్పవై దివ్యాస్త్రములను ఆర్జించితివి. అరణ్యవాసం గడిచింది. అజ్ఞాతవాసం నడిచింది. కౌరవుల పాపం పండినదని తలంచితివి. మీ దుర్దశ నిశకు ప్రభాతభేరి మ్రోగింది. ఇప్పుడేమిటి నీకు దుర్దశ పట్టినది. ఈ దౌర్భాగ్యము ఏ శాస్త్రనీతి? నీదియ ధర్మప్రాణమైన క్షత్రియజాతి. శౌర్య, ధైర్య, పరాక్రమ బలములు కలిగియూ ఈ దిక్కుమాలిన వైరాగ్యము ఏవైపునుండి వచ్చినది? బావా! ఈ పిరికి ప్రవర్తన నీకేకాక నీ పూర్వీకులైన ఆర్యపురుషులందరికీ తీరని తలవంపులు! ఛీ చాలు,చాలు, సిగ్గులేని ఈ పిరికితనము. క్షత్రియులందరికీ కళంకము. క్షత్రియునకు యుద్ధము రాచబాట! అసలు క్షత్రియ జాతికిది స్వర్గమార్గము.

ఈ సమయమున యుద్ధమే వద్దనిన అపకీర్తుల పాలగుదువు. స్వార్జితమైన ఆస్తి నీకు విజయుడను బిరుదు. యావజ్జీవితమంతయూ ధారపోసి సంపాదించిన యాకీర్తిని మట్టిపాలు చేతువా? క్షుద్రమైన ఆ మోహములను పరిత్యజించుకో బావా! నా మాట విను. గడచిన అమరావతి సంఘటనను జ్ఞాపకము చేసుకో.

ఊర్వశి తనకుతానై వలచిరాగా వలదని తిరస్కరించితివి. నీవలన నాకు పుత్రప్రాప్తిని చేకూర్చుమని అడుగగా, నన్నే పుత్రునిగా భావించమని కోరితివి. అట్టి అనన్య మహామునివి. జితేంద్రియుడివి. ఆ సమయమున ఊర్వశి తన పాచిక చెల్లక విఫల మనోరథురాలై నపుంసకునివి కమ్మనమని ఇచ్చిన శాపమే కదా విరాట నగరమున తీరినది. అట్టి ధీరత్వమెక్కడకు పోయెను? ఈ దీనత్వమెక్కడనుండి వచ్చెను? ఛా! యిట్టి పిరికిపందవు అర్థరాత్రిలో పరుగెత్తి వచ్చి నిద్రపోవుచున్న నన్ను యుద్ధమున సహాయమునకు రమ్మనమని లేపుకొని వచ్చినది ఈ పిరికి ప్రతాపమును చూపుటకా? చాలు చాలు యీ దౌర్భాగ్యపు మోహమును నిర్మూలనము చేయుము. దౌర్బల్యమును మంటకలుపుము. బలమును వహించుము" అనెను.

ఈ సమయమున కృష్ణపరమాత్మ నాల్గు పదములను ఉపయోగించెను. 1. కశ్మలమని, 2. అనార్యజుష్టమని 3 అస్వర్గ్యమని 4. అకీర్తికరమని. అందులో కశ్మలమనగా అజ్ఞాతమనియు, అనార్యజుష్టమనగా ఈశ్వర స్వభావ సుఖహాని అనియు, అస్వర్గ్యమనగా ఆది దైవిక సుఖహాని అనియు, అకీర్తికరమనగా ఆదిభౌతిక సుఖహాని అనియు సూచించినది. పౌరుషాన్ని పురికొల్పే క్షాత్రరక్తాన్ని కదిలించే శ్రీకృష్ణుని మాటలు అర్జునునిపై కొంత పనిచేసినవి. ఈ మాటల కిరణములతో అర్జునునిలోని కరుడుగట్టిన తమోగుణము కొంత కొంత కరుగుట మొదలిడినది. రజోగుణము కొంత పులకరించినది. ఈ రాజసిక తీక్షణతో అర్జునునికి తిరిగి కంట తడి యేర్పడి ప్రసంగమునకు ప్రయత్నిస్తాడు. అక్కడ అర్జునుడు "కథం?" అని కృష్ణుని ప్రశ్నిస్తాడు. దీనిని సూక్ష్మంగా యోచించిన ఈ పదము యొక్క లక్ష్యము చక్కని గుట్టును తెలుపుచున్నది. అదియేమన భగవత్ గీత **ఏమి చేయవలెనో అను విషయమును కాక, యెట్లు చేయవలెనో**

**అనునది తెలుపుచున్నది.** "కథం" అనగా యేవిధంగా అని తలంచవలెను. దీనిని బాగుగా గ్రహించవలెను. ముఖ్యముగా గమనించవలెను. *(గీ.పు. 13/15)*

మోహమున మునిగియుండు మూఢబుద్ధి
ముక్తి యననేమి తెలియదు ముగ్ధబుద్ధి
దుష్టయననేమి తెలియు దొడ్డబుద్ధి
చెడ్డనే నిత్యంబు స్మరించు గొడ్డుబుద్ధి *(ము.ము.పు. 88)*

**5. మదము** (మదమంటే క్రొవ్వు, మత్తు, గర్వము)

మదము వలన మానవుడు కన్నుమిన్నూ యెరుగక ప్రవర్తించుచుండును. ఇవి నాలుగు విధములయినటువంటివి. కుల మదము, ధన మదము, యౌవన మదము, విద్యా మదము. ఇంకను అనేక విధముల మదములు కలవు. కాని అవి అన్నియును నాల్గింటిపైనే ఆధారపడి వున్నవి. *(ప్ర.శో.వా.పు6)*

**ఆవరణ**

అద్దముపైన దట్టమైన బట్టను కప్పినప్పుడు అందులోని ప్రతిబింబము కనుపిస్తుందా? ఏమాత్రము కనుపించదు. మదముచేత స్వస్వరూపాన్ని మాలిన్యముగా చూస్తున్నాము. చంచలత్వము నేచర్ అనుకుంటున్నాము. నేను human body కనుక యిది సహజమనుకుంటున్నాము. సమర్థించుకుంటున్నాము. విద్యార్థులారా! మనము చేసేది అనుభవించేది ఆనందించేది యివన్నీ Reflection, Reaction and Resound, Reality ఒకటిగా ఉంటున్నది. ఈ రియాలిటీని మరిచిపోతున్నాము. రియాక్షన్ అనుసరిస్తున్నాము. రీసౌండును వింటున్నాము. రిఫ్లెక్షన్‌ను చూస్తున్నాము. ఈ అద్దము దట్టమైన బట్టతో మూయబడింది. ఏ బట్ట? **కామ క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యము లనే అరిషడ్వర్గములనే బట్ట. ఇవి మానవ దేహమునకు కొంత సహజములే.** అయినప్పటికీ **భుజబల మదము, ధనమదము, విద్యామదము, కుల మదము ఐశ్వర్యమదము, సౌందర్యమదము, యౌవన మదము తపో మదము ఇలాంటి అష్ట మదముల చేత ఈ అద్దము కప్పబడి వుంటున్నది.** ఈ బలము ఎంతవరకు

వుంటుంది? చెప్పటానికి వీలుకాదు. మన యౌవనము ఎంతసేపు వుంటుంది? మించునట్టుగా ఒక నిమిషము లోపల మారిపోతుంది. మన విద్యా మదమా? నీకంటే గొప్ప విద్యావంతులు లోకములో ఎంతమంది లేరు. నీ విద్య వారి దానిలో ఎంత? ఇవన్నీ విచారణ చేస్తే మదమునకు ఏ మాత్రము అవకాశము లేదు. ఇది భ్రాంతి, భ్రమ, చదువుల్ నేర్చితి నంచు గర్వము వహించన్‌రాదు. నీకున్న ఆచదువేపాటిది? విద్యకున్ వినయమే స్వస్వరూపము. మానవుని యందు ఈ నియమము రావాలి. విద్యార్థులందరూ వినయ విధేయతలు లేకపోవటం చేతనే మదము తలకెక్కుతున్నది. ఈ అష్టమదములు మానవత్వమును మరుగుపరచే దుష్ట గుణములు. ఈ మదములే మనస్సనే అద్దమును కప్పిపుచ్చినవి. ఈ దట్టమైన బట్టను తీసివేయాలనుకుంటే ప్రేమను పంచుకోవాలి. ఈ ప్రేమనే ప్రధానము. ఇదే ప్రత్యక్ష పరమాత్మ. ఈ పవిత్రమైన ప్రేమచేతనే సర్వులను ఒక్క రీతిగా కట్టుకోవచ్చును.

*(బృ.త్ర.పు. 85)*

**అసూయ (అసూయ అంటే కోపము, గుణములందు దోషములారోపించుట.)**

అసూయ భావమును నిర్మూలనము చేసుకోవాలి. నీవు పరిశుద్ధాత్మ స్వరూపుడవు. ఇదేవేదము. "శృణ్వంతు విశ్వే అమృతస్యపుత్రా" నీవు అమృత పుత్రుడవు నాయనా అని వర్ణిస్తుంది. కనుక నీవు విశాల భావమును అభివృద్ధి పరచుకో. ఈ ఇంద్రియములను అదుపులో పెట్టుకో. తద్వారా మానసికశుద్ధి ఏర్పడుతుంది. అప్పుడే త్రికరణ శుద్ధి కలిగి మానవుడుగా తయారవుతావు. మనసునందున్న మాలిన్యమును, అంత:కరణమునకు పట్టిన మాలిన్యమును, సత్కర్మలు, సద్బుద్ధి, సదాలోచన, సచ్చింతనచేత, సత్కర్మల చేత నిర్మూలించి పరిశుద్ధము చేసుకోవచ్చును, కనుకనే చెడ్డను చూడవద్దు. మంచిని చూడు అన్నారు. **చెడ్డను వినవద్దు మంచిని వినమన్నారు. ఈ విధమైన భావాలు మనము అభివృద్ధిపరచుకోవాలి.** *(బృ.త్ర.పు. 90)*

దైవమునందు కూడను దోషములు కనిపెట్టటం అసూయకు ఒక ప్రధానమైన గుణమన్నారు. అసూయకు ప్రధానగుణములు కొన్ని వుంటున్నాయి.

తమకంటె అధికకీర్తిని సంపాయించేవారిపైన అసూయ కలుగుతుంది. తనకంటె అధికసంపద కలిగినవానిపైన అసూయ కలుగుతుంది. తనకంటె అందముగా వున్నవానిపైన అసూయ కలుగుతుంది. తనకంటె అధికమార్కులు తీసుకొనేవారిపైన అసూయ కలుగుతుంది. తనకంటె యే విషయమునందైనా అందమునందుకాని, అధికారమునందు గాని, సంపదయందుగాని, గౌరవమునందుగాని, ప్రతిష్ఠయందుగాని అధికమైనచో అసూయ కలగటం మానవుని బలహీనత. **అసూయ మానవుని లోపల ప్రవేశించగనే ఎంతో కాలమునుండి సాధించి, సంపాదించుకున్న సద్గుణములు భస్మమైపోతుంటాయి. ఈ అసూయ వూరికే వదిలేది కాదు. మానవునియందున్న సమస్త సద్గుణములు నాశనము చేస్తుంది.** రాక్షసత్వాన్ని అభివృద్ధిపరుస్తుంది. మానవత్వాన్ని మాయం చేస్తుంది. పశుత్వాన్ని బలపరుస్తుంది. ముందు వెనుక యోచన చేయదు.

అసూయ ఉంటే మన సమస్తమును నాశనం చేస్తుంది. పరులను మాత్రమే నాశనం చేయుట కాదు. **తనను తాను నాశనం చేస్తుంది. అసూయపరునకు సుఖముగాని నిద్రగాని ఉండవు. కంటినిండ నిద్ర, కడుపునిండ తిండి, ఉండవు. ఏవిధమైన రోగము లేకపోయినప్పటికి అసూయ మనిషిని క్షీణింపచేస్తుంది. అంతక్షయమని దీనిపేరు.** క్షయరోగము దేహాన్ని క్రమక్రమేణ కనుపించేరీతిగా తగ్గిస్తుంది. కాని ఈ అసూయ లోపల చేరి అనేక విధములుగా భస్మము చేస్తుంది. **ఇది మహాఘోరమైన వ్యాధి. మనము తక్కువ స్థాయిలో వుండినా, ఎక్కువ స్థాయిలో వుండినవారిని చూచి ఆనందపడితే దైవము మనలను అనుగ్రహిస్తాడు.** మనకు లేదని వున్నవారిని చూచి అసూయపడితే తనయొక్క స్థితి మరింత దిగజారిపోతుంది. ఇది యీనాడు కలియుగములో సర్వత్ర వ్యాపించి వుంటున్నది. యోగియందు, భోగియందు, జోగియందు, విరాగియందు, బైరాగియందు, సర్వులయందు ఈ అసూయ అనే వ్యాధి వ్యాపించి వుంటున్నది.

అసూయచేతనే మానవుడు అశాంతికి గురియైపోతున్నాడు
అసూయ మానవుని అనేకవిధములుగా హింసిస్తుంది.

*(శ్రీ.స.గీ.పు. 216/218)*

ఏ సమయంలో యెక్కడ అసూయ అహంకారము వుంటుందో, అక్కడ ఏ రూపములో దేవుడు వచ్చి సరిదిద్దటానికి ప్రయత్నిస్తాడో చెప్పుటకు వీలుకాదు. కనుక మొట్టమొదట అసూయ, ద్వేషము, అహంకారములకు అవకాశము యివ్వకుండా చూచుకోవాలి.

అసూయ అనేది గ్రంథపఠనముచేత నాశము చేసుకోవటానికి కాదు. స్వప్రయత్నముతో సాధనలు సలిపి, హృదయమునందు పరివర్తన గావించుకొని, పరిపూర్ణమైన ప్రేమతో, దైవార్పితమైన బుద్ధితో అసూయను హతమార్చుకోవాలి. అసూయ వుండినంత కాలము మనలను యేమాత్రము రాణింపచేయదు. అది మనలోని సమస్త సద్గుణములను హతమార్చివేస్తుంది. మానవునియందు, అసూయ లేకుండా చేసుకోవటము ప్రధాన లక్షణమని గీత బోధించింది.

*(శ్రీ. గీ. పు)*

## 6. మాత్సర్యము : ద్వేషము (అంటే పగ, ఏవగింపు, రోత, విరోధము.)

మరణించిన రావణునికి అంత్యక్రియలు చేయుటకు విభీషణునికి మనస్కరించలేదు. శ్రీమన్నారాయణుడైన రామునిపైన ఇంత పగబూనిన యీ దుర్మార్గునికి అంత్యక్రియలు చేయుటము మహాపాపమని భావించాడు విభీషణుడు. సర్వధర్మములు ఎరిగినవాడు కనుక రాముడు, విభీషణుని దగ్గరకు పిలచి **'ద్వేషమనేది మరణము వరకు మాత్రమే ఉండాలి; మరణించిన తరువాత ద్వేషము ఉండటము చాలా అధర్మము"** అని తెలిపి "అతని మరణముతో నీ ద్వేషము కూడా మరణించాలి" అన్నాడు. "నీవు ఈ అంత్యక్రియలు ఆచరింతువా లేదా? నీవాచరింపవేని సోదరభావముచేత ఈ అంత్యక్రియలు నేనే ఆచరింతును" అని తాను సంసిద్ధుడైనాడు. ఈ మాట విన్న తక్షణమే విభీషణుడు రావణునియొక్క అంత్యక్రియలు చేయుటకు పూనుకొన్నాడు. ఈ విధముగా సర్వధర్మములు ఎరిగినటువంటివాడు కనుక **"రామోవిగ్రహవాన్ ధర్మః"** అన్నారు. కనుక అట్టి ధర్మస్వరూపుడైన శ్రీమన్నారాయణమూర్తియే రామావతారము ధరించి లోకములోని మానవులకు ఆదర్శమైన జీవితమును గడుపుతూ వచ్చాడు. కుటుంబములో ఏరీతిగా తాను నడుచుకోవాలి, మిత్రుల దగ్గర ఏరీతిగా ప్రవర్తించాలి. సమాజములో ఏరీతిగా ఆదర్శవంతమైన

జీవితమును నిరూపించాలి, అనే విషయాలను తన జీవితమున ప్రతిక్షణము ప్రకటిస్తూ వచ్చాడు. సర్వులయందు కూడను సమప్రేమను ధరించి సమప్రేమ చేతనే అందరినీ ఆదరించి ఆనందింపజేస్తూ వచ్చాడు. *(ఆ.రా.పు.28/29)*

## అకార పంచక అరిష్టములు

ఆనాటి విద్యార్థులు శిక్షణకు కట్టుబడి తు.చ. తప్పక నియమములను పాటించేవారు. ఆజ్ఞను ఉల్లంఘించే విద్యార్థిని ఆ పరిసర ప్రాంతమునకు రానిచ్చేవారు కాదు. అకార పంచక అరిష్టములు కలిగిన వ్యక్తిని గురువులు సహించేవారు కారు. అకారముతో ప్రారంభమయ్యే అరిష్టపంచకంలో **మొదటిది అలక్ష్యము, రెండవది అవినయము, మూడవది అహంకారము, నాలుగవది అసూయ, ఐదవది అసభ్యత** – ఈ ఐదింటినీ కూడినవాడు విద్యార్థిగా తగిన వాడు కాదు. అలక్ష్యము చేయకూడదు, అవినయము ప్రకటించ కూడదు, అహంకారం అంతకంటె ప్రమాదమైనది, **అసూయ మహాపాపస్వరూపమైనది,** ఇక అసభ్యత– మానవుడుగా ఉండికూడా సమాజమునందు ఏ విశిష్ట భావముతో జీవించాలో, దానికి విరుద్ధముగా జీవించుటయే అసభ్యత.

*(స.సా.జూ.91 పు.164)*

## మంచితనము

విద్యార్థులారా! 'హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్", ఎల్లప్పుడు సహాయమే చేయండి. ఎవ్వరిని బాధించకండి. ఇదే భారతీయ సంస్కృతి యొక్క ప్రధాన సూత్రము. మీరు గొప్ప డిగ్రీలు తీసుకోవచ్చు. విదేశాలకు పోవచ్చు, తప్పులేదు. కాని, భారతీయ సంస్కృతిని మాత్రం మర్చిపోకండి. ఎక్కడికి వెళ్ళినా మీ జీవితాన్ని ఆదర్శంగా నిరూపించండి. అందరితో స్నేహంగా ఉండండి. మంచి మాటలు మాట్లాడండి. మంచి పనులు చేయండి, **మంచి పేరు తెచ్చుకోండి. అదే నిజమైన మానవత్వం. మీరు గొప్పవారు కావడానికి ప్రాకులాడకండి. మంచివారు కావడానికి ప్రయత్నించండి. గొప్పవారు తప్పు పనులు చేయవచ్చు. కాని, మంచివారు ఏది చేసినా అది ఇతరులకు ఆదర్శప్రాయంగా ఉంటుంది. రావణుడు, రాముడు ఇరువురూ విద్యలో సమానులే! కాని, రావణుడు గొప్పవాడు, రాముడు మంచివాడు. చూశారా! మంచితనానికి, గొప్పతనానికి**

**ఇంత వ్యత్యాసం ఉంటుంది.** రావణుడు కామాన్ని బలపర్చుకున్నాడు. **ఈ ఒక్క దుర్గుణం చేత తనతోపాటు తన వంశాన్ని కూడా నాశనం చేసుకున్నాడు.హిరణ్యకశిపుడు పంచభూతములను హస్తగతం చేసుకొని వాటితో ఆడుకున్నవాడు. అంతటి గొప్పవాడు క్రోధం వలన నాశనమైపోయాడు. ఇంక, దుర్యోధనుని లో ఉన్న దుర్గుణం లోభత్వం.** పాండవులు కనీసం ఐదు గ్రామాలైనా ఇవ్వమని అడిగితే, సూదిమొన మోపినంత స్థలం కూడా ఇవ్వనన్నాడు. కట్టకడపటికి అతనికి ఏ గతి పట్టిందో మీకు తెలుసు. రావణుడు కామమువలన, హిరణ్యకశిపుడు క్రోధం వలన, దుర్యోధనుడు లోభం వలన, పూర్తిగా నాశనమై పోయారు. ఏదో ఒక్క దుర్గుణం ఉన్నవారే ఆవిధంగా నాశనమైపోతే, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే ఆరు దుర్గుణాలున్న మానవునికి ఏ గతిపడుతుందో ఒక్కతూరి యోచన చేసుకోండి. (స.సా.జ.2000పు.20)

మంచివారు ఎక్కడున్నప్పటికీ, ఆ మంచితనాన్ని ఎంతమంది ఎన్ని విధాలుగా దాచుటకు ప్రయత్నించినప్పటికీ అది దాగేది కాదు.

"పెద్ద వజ్రమొకటి పెంటలో దొరికిన
విలువ మారదు దాని వెలుగు పోదు
మంచి గుమ్మడిపండు కంచెలో కాచిన
రుచియు మారదు దాని చవియు పోదు
గొప్ప నెమలి గ్రుడ్డు కోడి తా పొదిగిన
వన్నె మారదు దాని చిన్నె పోదు"

అదే విధంగానే గొప్పవారి దివ్యతేజస్సులు,దివ్య ప్రభావములు, దివ్య తత్వములు ఏవిధమైన స్థానములో ఉన్నప్పటికీ ఎలాంటి పరిస్థితులందున్నప్పటికీ వాటి విలువ ఏనాటికి మారదు. *(స.సా.జ94.పు.3)*

**మంచినడత**

మంచికాలము, పదవులు, మంచిబ్రతుకు
కోరుచుందురు మనుజులు; కోరబోరు

మంచిబుద్ధులు జ్ఞానంబు, మంచినడత
ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు?
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులారా! *(స.సా.వా.పు106)*

## మంచిపనులు

"మంచిపనులన్నీ కష్టపడి చేయవలసి ఉంటుంది. సుఖం ఔన్నత్యం కలిసి జతగా ఉండలేవు. కష్టాలు మనిషిని ఎల్లప్పుడూ జాగ్రత్తగాను, పొందికగాను ఉండేటట్లు చేస్తాయి. మనిషిలో నిగూఢంగా ఉన్న కౌశల్యాలు, అపరిమితమైన తెలివి తేటలు క్రమమయ్యే లాగ చేస్తాయి. ధైర్యాన్ని పెంపొందిస్తాయి విశ్వాసం వేళ్ళు నాటుకొని బలపడేటట్లుగా చేస్తాయి. *(లో.పు. 13)*

## కళలు

మానవత్వాన్ని పశుత్వంగా అనుభవించటం మానవత్వానికే కళంకం. కామ క్రోధ లోభ మోహ మదమాత్సర్యములనే అరిషడ్వర్గములు మానవుణ్ణి హతమార్చివేస్తున్నవి. వేదము **"చంద్రమా మనసో జాత: చక్షుస్సూర్యో అజాయత"** అన్నది. చంద్రునికి పదహారు కళలు. ఈ పదహారు కళలు పూర్ణమైన స్థితిని పొందినప్పుడే తనలో ఎట్టి మచ్చలు లేకుండా ప్రశాంతమైన ప్రకాంతినిలో కాంతినందిస్తుంది. చంద్రుడు పదహారుకళలను పెంచుకున్నప్పుడే జగత్తుకు చక్కని ఆదర్శం. మానవుని యందు పదహారు గుణములున్నాయి. కాని ఈ పదహారు గుణములను నిర్మూలము చేసినప్పుడే మానవత్వానికి గొప్ప ప్రకాశము. **ఏమిటి ఈ పదహారు? ఆరిషడ్వర్గములు ఆరు, మదములు ఎనిమిది, రజస్తమోగుణములు రెండూ చేరిస్తే పదహారు గుణములౌతాయి**. వీటిని నిర్మూలము గావించుకోవాలి. కర్తృత్వ భోక్తత్వాలను తగ్గించుకోవాలి. అన్ని విధములా భగవంతునికి అర్పితం చేసి సర్వం బ్రహ్మమయమనే స్థితిలోపల సత్కర్మలు ఆచరిస్తూ పోయినప్పుడు సర్వము భగవంతుడే సహాయపరుస్తాడు.
*(బృ.త్ర.పు. 173)*

## పాపం

నిండుసభలో దుర్యోధన, దుశ్శాసనాదులు ద్రౌపదిని పరాభవించడానికి ప్రయత్నించారు. ఆమె శాంతంగా భీష్ముని వద్దకు వెళ్ళి "పితామహా! ధర్మజుడు

తానోడి నన్నోడెనా, లేక నన్నోడి తానోడెనా? చెప్పండి" అన్నది. మొట్టమొదట ధర్మజుడు తనను తాను ఒడ్డుకున్నాడు. తాను ఓడిన తరువాత ద్రౌపదిని ఒడ్డే అధికారం అతనికి లేదు. కానీ ద్రౌపది ప్రశ్నకు ద్రోణుడుగాని, భీష్ముడుగాని ఎవ్వరూ జవాబు చెప్పలేదు. ధృతరాష్ట్రుడు పెదవి విప్పలేదు. అప్పుడే విదురుడు చెప్పాడు. **"నరకమునకు పోయేవారు కేవలం పాపం చేసినవారు మాత్రమే కాదు : పాపం చేయడానికి పురిగొల్పినవారు పాపం చేయడం చూసినవారు, పాపం చేయడానికి మార్గం తెలిపేవారు కూడా నరకానికి పోతారు. పాపం చేయడం చూస్తూ దానిని తప్పించడానికి ప్రయత్నించనివారికి కూడా నరక ప్రాప్తి ఉంటుంది"** భీష్ముడు మహా జ్ఞానియే కానీ నిరపరాధియైన స్త్రీని దుర్యోధన దుశ్శాసనాదులు నిండు సభలో పరాభవిస్తుంటే తానెందుకు వారికి అడ్డు చెప్పలేదు?

కనుకనే 56 దినములు శరతల్పములపై పరుండి ఆ పాప ఫలితాన్ని ప్రత్యక్షంగా అనుభవించాడు. ఆనాడు కౌరవులు చేసిన పాపానికి అడ్డు తగిలి ఉంటే తనకీ బాధ తప్పేది కదా! *(స.సా.మా.99 పు. 62/63)*

## మనసు/మనస్సు

ఈనాడు మానవుడు మనసు (మైండ్) పదార్థము (మేటర్) యొక్క తేడాను గుర్తించలేకపోతున్నాడు. **మనసును గుర్తించినవాడే మహనీయుడు.** ఈ మనసు యొక్క స్వరూపమేమిటి? ఇది ఎక్కడనుంచి ఆవిర్భవించింది? దీని యొక్క నేచర్ ఏమిటి? అని విచారణ చేస్తే **ఆత్మకు మూడు శక్తులు ఉన్నాయి. 1. మనసు 2. బుద్ధి 3. సంకల్పం.** మనోబుద్ధుల సంకల్పముల స్వరూపమే 'ఆత్మ'. కనుక ఆత్మ నుండి ఆవిర్భవించినదే ఈ 'మనసు' ఈ మనసు యొక్క విశాలతను వర్ణించుటకు సాధ్యము కాదు. దీనినే సంస్కృతము నందు

**"సర్వత: పాణిపదం తత్సర్వతోక్షి శిరోముఖమ్**
**సర్వత: శృతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి"**

దీనిని సంకల్పించిన మనసు ఎంత దూరమైనా క్షణంలో ప్రయాణం చేస్తుంది. సర్వత్రా క్షణములో వ్యాపించిపోతుంది. ఈ మనసు యొక్క శక్తిని

ఎవరూ గుర్తించలేరు, విచారించలేరు. దీనిని వర్ణించుటకు భాషయే చాలదు. కనుక మనసు యొక్క శక్తి ఇట్టిదీ, అట్టిదీ అని చెప్పుటకు సాధ్యం కాదు. మనసు అనే శక్తి లేకుండా ఏ చిన్న కార్యాన్నయినా సాధించలేము. ఈ మనసుకు రూపం లేదు. మనసు చేసేదంతయూ ఆత్మ శక్తి ద్వారానే చేస్తుంటుంది. లోపలనున్న ఆత్మ ఈ మనసు ద్వారా, ప్రపంచంలో సర్వకర్మలనూ ఆచరిస్తూ వస్తున్నది. ఈ మనోవికారములు, మనో వికాసములు గుర్తించవలెననిన ఎన్ని సంవత్సరములు అయినా చాలదు. కొన్ని యుగములకైనా వీలుకాదు.

రెండవది బుద్ధి. ఇది ప్రకాశవంతమైనటువంటిది. వికాసవంతమైనటు వంటిది. విచారణ చేయటమే ఈ బుద్ధి యొక్క సత్యం. **ఆ డిస్క్రిమినేషన్ లోపల కూడనూ, స్వార్థస్వప్రయోజనములను ఏమాత్రం స్థానం లేకుండా చేయగలదు ఈ బుద్ధి.**

మూడవది సంకల్పము. ఈ సంకల్పములు ఈ జన్మలో చేసినవేగాక, వచ్చేజన్మలో కూడా ఇంకా ఎన్నియో దీని ఫలితములను అందిస్తూ వస్తుంటుంది. ఇది సంస్కారవంతమైనది. **సంస్కారమనగా ఏమిటి? చెడును దూరం చేసి మంచిని పోషించడమే.** నిత్యజీవితంలో మనం ఏ కర్మల నాచరిస్తుంటామో, ఆ కర్మల యొక్క దోషములను నిర్మూలనం గావించి, దోషరహితమైన కర్మలుగా తీర్చిదిద్దుకోవటమే సంస్కారం. *(శ్రీ. ఫి. 2002 పు. 28)*

మనస్సు నిన్ను పీడించటం లేదు. సమస్తము దాని వినియోగంపై ఆధారపడియున్నది. మనస్సు సర్వత్ర వ్యాపించింది. దేనిలో చేరితే ఆ రూపాన్ని పొందుతుంది. మనస్సుకు మరణం లేదు. అందువల్లనే **"మనోమూల మిదం జగత్" అన్నారు. అట్టి మనస్సు నాశనం కాదు. కనుక, మనోనాశనమన్న పదం సరియైనది కాదు. నీవు కోరవలసింది మనోనాశనం కాదు. మనోలయాన్ని కోరాలి. నది సముద్రంలో కలుస్తుంది. అదేరీతిగా మనస్సు ఆత్మలో లయం కావాలి. పరమాత్మలో లీనం కావాలి. ఇదీ మనోలయమంటే!** మాధవునికి అర్పితమైన మనస్సు రామదాసుగా మారి పూజార్హమౌతుంది. వానరమూర్తియైన ఆంజనేయస్వామి రామదాసుగా వాసికెక్కి పూజలందుకుంటున్నాడు. కాని.

**మానవుడు మనస్సుని కామదాసునిగా చేసి పతనమౌతున్నాడు. మనస్సు కలిమి, బలిమి, చెలిమిలపై ప్రసరించకూడదు. భగవంతునిపై నిలిచి తన్మయం కావాలి.**

*(స.సా.జూ.2000పు.190)*

మనస్సు ఒక కోతి, దీనికి విషయవాసన అనే మద్యము త్రాపిన తరువాత, ఇంక గుణములతో ఉన్నటువంటి రౌద్రములనే తేళ్ళు కుట్టిన తరువాత, దీనికి ప్రపంచవ్యామోహమనే పిచ్చికూడను పడుతుంది. కనుక ఈ పరిస్థితియందు మానవుడు ఏరీతిగా మనస్సును అరికట్టడం? ఈ దేహమునకుగానీ, ఈ మానవత్వమునకుగానీ విమోచన లేదా? ఈనాటి యువకులకు ఒక ఘోరమైన వ్యాధి పట్టింది. అది ఏదనగా యవ్వనసన్నిపాతము, ఇది మానవత్వములో ఉన్నటువంటి దివ్యత్వమును మరిపింపచేస్తుంది.

*(ఆ.రా.పు.102)*

మనసును కోతి, కుక్క అని తిట్టరాదు. అది చెప్పినట్లు వింటుంది. సాధన లక్షణాల్ని పట్టి గురువు ఉపదేశాన్ని బట్టి, మంచి రోడ్డులో తీసుకొనివచ్చి దివ్యత్వమనే సింహద్వారానికి చేరుస్తుంది. లేకపోతే సందుగొందులకు తిప్పి ముళ్లలో పడవేస్తుంది. మనస్సును చక్కచేస్తే అదే మంచిమార్గమును చూపిస్తుంది. **"మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో:'...బంధనానికి మోక్షానికి రెండింటికి మనసే కారణం.** దీనికి కృతజ్ఞతను చూపించవలయును.

*(సు.పు.50)*

## మనస్సుయొక్క తత్త్వము

వర్ణించడం కష్టం. ఒక నిమిషంలో పిచ్చికోతివలె ప్రవర్తిస్తుంది, మరొక సమయంలో దివ్యమైన భావాలతో ప్రకాశిస్తుంది. ఒకానొక సమయంలో మనిషిని చూచి కోతి నవ్విందట. "మనిషీ! నీవు సర్వశక్తిమయుడవని భావిస్తున్నావు. విజ్ఞాన సుజ్ఞానములకు నీవే మూలాధారమని గర్విస్తున్నావు. ఈ విధంగా నీవు గర్వించవద్దు. ఎందుకంటే, నేను నీయందు మనస్సునై ఉన్నాను. నీ జీవితం నాపై ఆధారపడి ఉన్నది. నేను కొంత పెడ మార్గం పడితే నీ జీవితమే పెడమార్గం పడుతుంది. నేనుసక్రమమైన మార్గంలో నడచినప్పుడే నీ జీవితం సవ్యంగా సాగుతుంది. నేను కోతినైనప్పటికి రామనామస్మరణ చేస్తూ, రామసేవలో

పాల్గొని, రామకార్యమును విజయవంతం గావించాను" అన్నదట. ఈ విధంగా, మనస్సు సక్రమమైన మార్గంలో ప్రవేశించినప్పుడే దైవసన్నిధిని, దైవపెన్నిధిని అనుభవిస్తుంది. మనస్సు పెడ మార్గమున ప్రవేశిస్తే జీవితమును అధఃపతనం గావిస్తుంది. అప్పుడు మనస్సును Monkey Mind అంటారు. అందుచేత Mankind కావాలిగాని, Monkey Mind కాకూడదు. దివ్యత్వమును స్మరించవలెనన్న, పవిత్రతను అనుభవించవలెనన్న మనస్సే ఆధారం. మనసే లేక మనిషే లేదు. మనస్సును సక్రమమైన మార్గంలో ప్రవేశపెట్టాలి. Start Early, Drive Slowly, Reach Safely. చిన్నతనము నుండియే మనస్సును సక్రమమైన మార్గంలో ప్రవేశపెడితే మీరుచాల దివ్యమైన స్థానమును పొందుతారు.

*(సా. శు. పు. 52)*

అటులనే మనస్సు తన అధిపతికి భద్రత కలిగించే తలంపులను, భావాలను చేర్చుకోవాలి. అంతేకాదు ఎవరు లోపలికి వస్తున్నారు? ఎవరు బయటకు పోతున్నారన్న విషయాన్ని కాపలాదారు ఏ విధంగా జాగ్రత్తగా పరిశీలిస్తుంటాడో, అదేవిధముగ మనస్సులోనికి చెడు తలంపులు, దుర్భావములు ప్రవేశించకుండ జాగ్రత్త వహించాలి. *(భ. ప్ర. పు. 40)*

మాను దిద్దగలరు మరి వంపు లేకుండ
దిద్ద గలరు రాయి తిన్నగను
మనసు దిద్దగలర మరి వంపులేకుండ
చక్కనైన మాట సాయిమాట *(సా. పు. 484)*

గాలి యందున జ్యోతి కదలుచుండు
గాలిలేని జ్యోతి కదలకుండు
గాలి వంటి ఆశ కట్టివేసిన యంత
నిశ్చలంబైన మనసు నిలిచియుండు *(సా. పు. 12)*

మనస్సునకు రెండు విధములైన స్థితులు ఉంటాయన్నది. మొదటిది శుద్ధము. రెండవది అశుద్ధము. **కోరికలతో కూడిన మనస్సు అశుద్ధము. అవి లేని మనస్సు శుద్ధము.** బంధమోక్షములకు మనస్సే కారణం. మనస్సు ఒక క్షణమైనా ఒక స్థితియందుండదు. తటాకము నందు ఎడతెరిపి లేకుండా

రాళ్ళు రువ్వుతూ వుంటే ఏ విధముగా అది ప్రశాంతిగా యుండగలదు? ఏనాడు యీ రాళ్ళు రువ్వడం మానెదమో ఆనాడే ప్రశాంతి పరిస్థితిని పొందుతుంది. అదేవిధముగా మానవ సరోవరమునందు, ఎడతెరిపి లేకుండా కోరికలనే రాళ్ళు రువ్వుతున్నప్పుడు ఈ మనస్సు ఏవిధంగా ప్రశాంతి పొందగలదు. మానసిక శాంతి కావాలంటే భక్తులు, వ్యక్తులు కోరికలనే రాళ్ళను మానసికమునందు ప్రవేశింపకుండా చూచుకొనవలయును.

వేదశాస్త్రములు వివరించి బుధులచే
చదివించవచ్చు తా చదువు వచ్చు,
యజ్ఞయాగ తపంబులు అధికార జనులచే
చేయించవచ్చు తా చేయవచ్చు,
ఇలలోన గల తీర్థములకేగ అన్యులకు
బోధించవచ్చు తా బోవవచ్చు,
అష్టాంగ విద్యలు తానన్యులకు
ఉపదేశించవచ్చు తాసాధించవచ్చు
కాని దేహేంద్రియములను అరికట్టి
మనసు నిల్ప అంతర్ముఖము చేసి,
అనవరతము నిశ్చల, సమాన చిత్తులై నిలువలేరు. *(సా.పు. 590)*

ఇనుప పాత్రయైన హేమ పాత్రంబైన, నీటి తేటవలన మేటికెక్కు
మనస్సు మంచిదైన తనువులు మాటేమి!
ఉన్నమాట చెప్పుచున్నమాట! *(సా.పు. 175)*

**మనసు ఎట్లు పారిపోతే అట్లు పారిపోనీ, నీవు మాత్రము దాని వెంట ఎక్కడ పోతుందా అని చూచుకుంటూ పోవద్దు. నీవు ఉన్నచోటే ఉండు. మనసు ఇష్టమొచ్చినట్లు తిరిగి తిరిగి కడకు అలసి నీ చెంతకే వచ్చును. మనసు ఏమియు తెలియని పసిబిడ్డవంటిది. తల్లిపిల్చే కొలదీ తాను కూడను దూరముగా పోవుచునే యుండును. అట్లుకాక, ఆ బిడ్డవైపు చూడక, తల్లిపాటికి తల్లి వెనుకకు తిరిగిన బిడ్డ తన పాటికి తానే పరుగెత్తుకొని తల్లిచెంతకు వచ్చి చేరును.** నీ నియమము ప్రకారం నీ ఇష్టనామ ధ్యానములను ఆచరించు; మనస్సును లక్ష్యపెట్టకు.

తప్పక నీ ధ్యానమున ఏకాగ్రత ఫలించును. నీవు శుచి, అశుచి అనే మాటనే మనసులోనికి చేరనివ్వవద్దు. ప్రపంచమున అశుచి పదార్థమంటూ లేనేలేదు. సర్వాంతర్యామిగా పరమాత్ముడు ఉన్నప్పుడు అశుచి ఎక్కడిది? బాహ్య దృశ్యమునకూ అనుభవమునకూ అశుచి అనుకున్ననూ దానికి పరమాత్మ నామము సోకగనే శుచిగా మారును. *(స.సా.జూ.1989 చివరిపుట)*

సకల విద్యలు చేర్చి సభ జయించవచ్చు
శూరుడై రణమందు పోరవచ్చు
రాజరాజై పుట్టి రాజ్యమేలగవచ్చు
హేమ గోదానముల్ ఈయవచ్చు
గగనమందున్న చుక్కలు లెక్క గొనవచ్చు
జీవరాసుల పేర్లు చెప్పవచ్చు
అష్టాంగవిద్యలు అభ్యసించగవచ్చు
చంద్రమండల యాత్ర సలుపవచ్చు
కాని దేహేంద్రియాదుల కట్టిపెట్టి
మనసునంతర్ముఖముచేసి యనవరతము
నిశ్చలసమాన చిత్తులై నిలువలేదు *(బృ.త్ర.పు.47)*

మనసు కారణంబు మరియెందు నుండిన
ఇండ్లు అడవి ముక్తి నీయలేవు
మనసు లేనివాడు మందిరమున నున్న
కాననమున నున్న కార్యమొకటి.

**"మనోమూల మిదం జగత్"** జగత్తంతయు మనసు పైననే ఆధారపడి ఉంటున్నది. సుఖదు:ఖములు, పాపపుణ్యములు సత్యాసత్యములు అన్యాయ అక్రమములు అన్నీ మనసునందే జరుగుతున్నవి. అన్నింటికినీ మనస్సే కారణము. 'మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో:' బంధమోక్షములకు మనసే కారణము. ఈ మనస్సు శుద్ధమైన అద్దమువంటిది. మనస్సుకు స్వతస్సిద్ధమైన శక్తిలేదు. మనస్సు ఇంద్రియములను ఆశ్రయించి

వుంటున్నది. ఇది నేత్రముల ద్వారా వింటున్నది. స్వతహాగా తాను వినలేదు. ఇదే విధముగనే అన్ని యింద్రియముల ద్వారాను యీ మనస్సు కార్యములు సలుపుతున్నది. ఇంద్రియములు చేసిన దోషములన్నియు మనస్సనే అద్దముపైన చిత్రింపబడుతున్నవి. ఇంద్రియములు సంకల్ప వికల్పకాత్మకమైన తత్వముతో కూడి ఉంటున్నవి ఇందులో దోషము ఎవరిది? ఇంద్రియములదా? లేక మనస్సుదా. మనస్సునందు స్వతస్సిద్ధమైన దోషములు లేవు.

*(బృ.త్ర.పు. 79/80)*

మనసే హేతువు మనుజుని
మనుగడకును బంధమునకు మాన్యతకును (తా)
మనసే ముక్తికి ముఖ్యము
మనసే నరకంబు దెచ్చు మైమరపించున్ *(బృ.త్ర.పు. 68)*

మనస్సుకు కూడను కొన్ని రంగులు ఉన్నవి. భేదభావములతో కూడిన మనస్సు ఎర్రని రంగుగా, స్వార్థభావముతో కూడిన మనస్సు గోధుమరంగుగా, అహంకారముతో కూడిన మనస్సు కమలాపండు రంగుగా, భగవదర్పితమైన మనస్సు తెల్లగా ఈ వస్త్రం వలె శుద్ధమైనదిగా ఉంటుంది. మనస్సుకు అనేక విధములైన రంగులను మనమే వేసుకుంటున్నాము. ఇది కూడను ఇతరుల ప్రభావము కాదు. మన సంకల్పములే మనకు ఈ దుర్గతిని సద్గతిని చేర్చుతున్నాయి. సంకల్పములను సరియైనవిగా ఎన్నుకున్నప్పుడే, అభివృద్ధి పరచుకున్నప్పుడే మన జీవితము శాంతి భద్రతలతో ఉండగలదు.

*(బృ.త్ర.పు. 71)*

మనస్సును మాయలమారి అని, మాయ అనికూడనూ పిలుస్తూ వచ్చారు. ఇది ఒక మార్జాలము వంటిది. *(బృ.త్ర.పు. 75)*

మనస్సు దేహాన్ని ఆశ్రయించివుంటున్నది. ఈ దేహమునకుండిన కన్ను ముక్కు చెవులు నోరు వీటి ద్వారానే మనస్సు యీ పంచభూతములన్నింటిని అనుభవిస్తోంది. మనస్సు దేహము యొక్క నేత్రముల ద్వారా చూస్తోంది. దేహము యొక్క కర్ణముల ద్వారా వింటున్నది. మనస్సుకు రూపము లేదు.

మనస్సే మాయ. మనసే కోరిక, మనసే ప్రకృతి, మనసే అవిద్య. మనసే ప్రాకృతమైన భ్రాంతి. ఇట్టి భ్రాంతితో కూడిన మనస్సు ద్వారా నిత్యసత్యమైన బ్రహ్మతత్వమును మనము అర్థము చేసుకోవటము చాలా కష్టము. ఏది నిజమైన జ్ఞానము? మనస్సుచేత ఇంద్రియములను స్వాధీనపరచుకొని ఇంద్రియ నాశనము గావించిన తరువాత మనస్సు కూడను అంతర్ధానమవు తుంది. ప్రశాంతమైన మౌనతత్వము ఏర్పడుతుంది. ఈ మనోనాశనము వలన కలిగిన మౌనమనే నిజమైన జ్ఞానము. *(బృ.త్ర.పు. 132/133)*

**మనస్సుండినంతవరకు కోరికలు తప్పవు.** కోరికలుండినంతవరుకు అభిమాన మమకారములు వదలవు. అభిమాన మమకారము లుండినంతవరకునూ అహంకారము పోదు. అహంకారము పోయేంతవరకు ఆత్మజ్ఞానము కలుగదు. ఆత్మజ్ఞానముగాని ఆత్మానందముగాని ఆత్మదర్శనముగాని మనోనాశనము చేతనే సంభవిస్తుంది. అన్యమార్గములో లభ్యముకాదు. *(బృ.త్ర.పు. 124/125)*

మనసు నిర్మలంబు మంచికి మార్గంబు
మనసు నిర్మలంబు మహితశక్తి
నిర్మలంపు మనసె నీరధిముత్యమౌ
మరచిపోకు డిట్టి మంచిమాట *(బృ.త్ర.పు. 92)*

మనసను ఆయుధంబునిదె మానవజాతికి యిచ్చెతొల్లి ఆ
మనసుని శిక్షలో నిల్పు మానవుడే విజయుండు భూమిపై
మనసుకు దాసుడైన మహి మానవుడెన్నడు శాంతి సౌఖ్యముల్
కనుగొనజూచినట్లు వినిపింపగ గల్గదు స్వప్నమందునన్.

మానవజాతికి మనస్సనే ఒక పదునైన కత్తి అందించబడినది. ప్రప్రథములో మానవుడు ఈ మనస్సు యొక్క తత్వాన్ని గుర్తించి వర్తించినప్పుడే మానవత్వము సార్థకమవుతుంది. మనస్సు బలవత్తరమైనది. మనస్సు చాలా వేగముగా పరిగెట్టేటటువంటిది. మనస్సు ఆకాశము కంటే తేలికైనది. విద్యుచ్ఛక్తి కంటే సూక్ష్మమైనది. ఇట్టి మనస్తత్వాన్ని మానవుడు గుర్తించుకొనలేక మనస్సును

పెడమార్గములో ఉపయోగపెట్టి అనేక విధములైన దు:ఖములకు విచారములకు గురియగుచున్నాడు. మనస్సు ప్రకాశము కంటే అతివేగముగా పరిగెట్టుతుంది.
*(స.ది.పు59)*

"యత్ర యత్ర మనస్ఫూర్తి
తత్ర తత్ర జగత్రయాం
యత్ర యత్ర మనోనాస్తి
తత్ర తత్ర నకించనా"

ఎక్కడెక్కడ మనస్సు స్ఫురించుచున్నదో, అక్కడంతా ముల్లోకములు నిండి ఉంటాయి. ఎక్కడ మనస్సులేదో అక్కడ ఏమియునూ లేదు. ఈనాటి సమస్యలకు, కష్టములకు దు:ఖములకు, విచారములకు మూలకారణం మనస్సే. మనస్సు నిర్మూలనం గావించుకొనవలెననిన వాంఛలను అదుపులో పెట్టుకోవాలి. *(శ్రీ.అ.1999 పు.7)*

## ప్రధానసూత్రములు

**Bend the Body, Mend the Senses, End the Mind**

(కష్టించి పనిచేయండి.ఇంద్రియములను అరికట్టుకోండి. అనమస్కులు కండి). ఇవి భారతీయ సంస్కృతి యొక్క ప్రధాన సూత్రములు. ప్రతి మానవుడు ఈ సంస్కృతికి వారసుడే. ఈ సంస్కృతిని సక్రమమైన మార్గంలో అనుభవించినప్పుడే మానవుడు సార్థక జీవితమును గడిపినవాడౌతాడు.
*(స.సా.జూలై99 పు.186)*

## బుద్ధి

మనకు బాగా ఉక్కపోతగా ఉన్నప్పుడు విసనకఱ్ఱతో విసురుకుంటే చల్లదనం చిక్కుతుంది. అదే విసనకఱ్ఱను ఇతరులవైపు త్రిప్పితే ఆ చల్లదనం వారికే పోతుంది. మన బుద్ధియే మన విసనకఱ్ఱ. దానిని ఆత్మవైపు త్రిప్పి విసిరితే ఆత్మానందం కలుగుతుంది. దేహం వైపు త్రిప్పి విసిరితే దేహానికి ఆనందం కలుగుతుంది. ఈ దేహానందం క్షణికమైనది. ఈ దేహం ఒక మలినపు కొంప. దీనివల్ల సుఖం లేదు. ఆత్మవైపులో చేరితే ఆనందం లభిస్తుంది.

హెడ్–హార్ట్–హ్యాండ్ ఈ మూడింటినీ ఆధారంగా తీసుకోవాలి. హృదయంలో భగవంతుని నిలుపుకో. తలతో దైవాన్ని చింతించు. చేతులతో పనిచెయ్యి.

| | | |
|---|---|---|
| See no evil | - | See What is good |
| Hear no evil | - | Hear What is good |
| Talk no evil | - | Talk What is good |
| Think no evil | - | Think What is good |
| Do no evil | - | Do What is good |

This is the way to God. *(వే. యు. పు. 29)*

బుద్ధి అనే సూర్యునిచేత దుర్భావాలనే సముద్రజలాన్ని సద్భావాలనే ఆవిరిగా మార్చుకొని, సత్యమనే మేఘం నుండి ప్రేమజలం కురుస్తుంది. చివరికి అది అనుగ్రహ సాగరంలో లీనమైపోతుంది.

*(సా. సా. జూలై2000 పు. 196)*

బుద్ధి అంటే ఏమిటని ప్రత్యేకంగా విచారణ చేసినప్పుడు చదువుకున్న వాడుగాని, చదువులేనివాడుగాని, మూర్ఖుడుగాని, మేధాశక్తి గలిగినవాడుగాని బుద్ధి అనగా విచారణాశక్తి అంటున్నారు. నిత్యానిత్య విషయ పరిశీలన బుద్ధి యొక్క స్వభావము అన్నారు. ఇది సరియైన అర్థము కాదు. ఈ బుద్ధికి ఐదు అంశములుంటున్నాయి. ఏమిటీ **ఐదు అంశములు**? **శ్రద్ధ, ఋతు, సత్యము, యోగము, మహత్తత్వము.** ఈ ఐదు అంశములతో కూడిన బుద్ధిని కేవలం నిత్యానిత్య పరిశీలనాశక్తి యని చెప్పటం ఎంత పొరపాటు! శ్రద్ధకు రెండువిధములైన శక్తులుంటున్నాయి. ఇది గాఢ విశ్వాసముతో కూడినది. ఈ విశ్వాసము స్థిరత్వముతో ఉండినది. ఋతము నుండి ఆవిర్భవించిన వాక్ స్వరూపమే సత్యము. ఈ సత్యము తరువాత యోగము. ఏమిటీ యోగము?సర్వేంద్రియములను స్వాధీనము చేసుకునే తత్వము యోగము. ఇంక, మహత్తత్వ మనగా ఏమిటి? ఇది చాలా పవిత్రమైన స్థితి. దివ్యమైన, నవ్యమైన స్థితి.ఇది ఇట్టిది, అట్టిది అని ఎవరూ వర్ణించలేరు. కనుక శ్రద్ధతో, ఋతముతో,సత్యముతో, యోగముతో, మహత్‌తత్వంతో కూడినది బుద్ధియొక్క

స్వరూపము. ఇలాంటి సర్వశక్తులతో కూడిన బుద్ధిని కేవలం నిత్యానిత్య విషయ పరిశీలనతో పోల్చితే బుద్ధిని ఎంత చులకన చేసిన వారమౌతాము! ప్రతి పదమునకు సరైన అర్థమును గుర్తించుటకు ప్రయత్నించాలి.

*(ద.స. 98పుకా/51)*

**బుద్ధి అనగా ఏమిటి? ఇది విచక్షణాజ్ఞానముతో కూడినది. ఇది మనస్సుకు అతీతమైనది.** మొట్టమొదటిది దేహము. దానికి పైభాగమున ఉన్నవి యింద్రియములు. దానికంటే పైభాగమున ఉన్నది మనస్సు. దానికంటే పైభాగమున ఉన్నది బుద్ధి. బుద్ధి పైభాగమే ఆత్మ. కనుక ఆత్మకు అతి సమీపములో నుండుట చేత ఆత్మ ప్రభావము, ప్రకాశము బుద్ధిపైన పడుతూ ఉంటుంది. మనస్సుకు అతీతమైన తత్వము బుద్ధి. ఈ బుద్ధితో కొంతవరకు విచారణ చేసి మానవుడు బుద్ధిగా బ్రతకాలి. అప్పుడే నిజమైన ఆత్మతత్వము అర్థమవుతుంది.

*(స.ది.పు. 87)*

'బుద్ధి గ్రాహ్య మతీంద్రియం' అన్నట్టుగా, బుద్ధిని ఒక ప్రత్యేకమైనటువంటి స్థానమునందు అనుభవిస్తూ వస్తున్నారు ప్రజలు. ఇది ఒక స్ఫటికము వంటిది. దీనికి స్వప్రకాశమన్నటువంటిది శూన్యము. ఆత్మకు సమీపంగా ఉండటంచేత, ఆత్మయొక్క ప్రకాశముచేత ఇది ప్రకాశిస్తూ ఉంటుంది. ఆత్మయొక్క ప్రకాశము బుద్ధిపైన పడటంచేతనే, బుద్ధి ప్రకాశమైనటువంటిదిగా మనకు గోచరిస్తూ వస్తున్నది. చంద్రుడు స్వప్రకాశకుడుకాడు. సూర్యునియొక్క కిరణములు చంద్రునిపైన పడటంచేత చంద్రుడు కూడను ప్రకాశవంతుడుగా మనకు గోచరిస్తున్నాడు. అదేవిధముగనే, బుద్ధికి స్వప్రకాశమన్నటువంటిది లేదు. కత్తిని పదునువలె, మనస్సును బుద్ధి అంటి వుండును. *(ఆ.రా.పు. 156)*

చిత్త శుద్ధిలేని రిక్త సాధకునకు
ఆత్మ తత్త్వమెట్లు అబ్బునొక్క
ఆత్మ తత్త్వమబ్బు అది శుద్ధ బుద్ధికే
సత్యమైన బాట సాయిమాట *(సా.పు. 381)*

మీ హృదయమే మిమ్ములను గమ్యస్థానం చేరుస్తుంది. మీ హృదయాన్ని

నమ్మండి. నిర్మల హృదయం బుద్ధికి అవతల వుంటుంది. అదే మిమ్ములను ప్రేరేపిస్తుంది. *(సా. పు. 522)*

మేధస్సుకంటె బుద్ధి చాలా శక్తిమంతమైనదనే సత్యాన్ని విద్యార్థులు గుర్తించాలి. ఇది సామాన్యమైన బుద్ధికాదు. అస్థస్వాస్థ అనే ఆసక్తి స్థిరత్వములతో కూడిన శాంతియే యీ బుద్ధి. ఋతము సత్యము రెండింటితో ఏకీభవించినదే ఈ బుద్ధి. యోగము మహత్తత్వము రెండింటితో కూడినదే ఈ బుద్ధి. బుద్ధి అనగా ఆలోచనా శక్తి విచారణశక్తి వివేకశక్తి విజ్ఞాన శక్తి మాత్రమే కాదు. విచక్షణా శక్తితో కూడిన విచారణశక్తి. *(బృ. త్ర. పు. 116)*

బుద్ధి ఆత్మకు సమీపముగా వుంటుంది. కనుక ఆత్మయొక్క ప్రకాశము ఆత్మయొక్క ప్రభావము ఈ బుద్ధిని సరిగా చేయటానికి అవకాశముంటుంది. ఆత్మశక్తి ఇంచుమించు 90 శాతము బుద్ధిమీదకురావటానికి అవకాశ ముంటుంది. ఈ బుద్ధి ప్రభావము మనస్సుపైన, మనస్సు ప్రభావము ఇంద్రియ ములపైన, ఇంద్రియముల ప్రభావము దేహముపైన ప్రసరిస్తుంది. దశోపనిషత్తుల యందు ప్రధానమైనది, తైత్తిరీయోపనిషత్తు. అది బుద్ధిని ఒక పక్షిగా వర్ణించింది. దాని శిరస్సు శ్రద్ధ, కుడి రెక్క ఋతము, ఎడమరెక్క సత్యము, మధ్యనున్న దేహము మహత్తత్వము, తోక యోగము అని నామకరణ చేసింది. కనుక బుద్ధి ఒక భాగము కాదు, ఋతము సత్యము. మహతత్వము యోగములతో కూడినట్టిది. బుద్ధి సామాన్యమైనది కాదు. ఇన్ని అంగములతో కూడినపుడే ఇది పరిపూర్ణ స్వరూపాన్ని పొందుతుంది. *(బృ. త్ర. పు. 95/96)*

**బుద్ధిదోషము**

కౌరవపాండవుల మధ్య సంధి కుదర్చడానికి కృష్ణుడు హస్తినాపురం వెళ్ళినపుడు దుర్యోధనునకు అనేక విధములుగా హితబోధ చేశాడు. కాని, సర్వధర్మములు తెలిసిన దుర్యోధనుడు కృష్ణుని హితబోధను లెక్కచేయలేదు. కారణం ఏమిటి? సత్యమేమిటో, ధర్మమేమిటో తనకు తెలిసి కూడా బుద్ధిదోషముచేత వాటిని ఆచరణలో పెట్టలేకపోయాడు. కట్టకడపటికి అతనికి ఏ గతిపట్టిందో మీకు తెలుసు.

నారదుడు రావణుని వద్దకు వెళ్ళి పరస్త్రీని అపహరించడం మహాపాపమని, సీతను రామునికి అప్పజెప్పమని బోధించాడు. ఇల్లాలు మండోదరి కూడా ఎంతగానో నచ్చజెప్పింది. కానీ, రావణుడు వారి హితబోధను పెడచెవిని పెట్టి సర్వ నాశనమయ్యాడు.

రావణునికి పట్టిన గతే హిరణ్యకశిపునికి కూడా పట్టింది. అతనిని మించిన సైంటిస్టు మరొకడు లేడు. ఈనాటి సైంటిస్టులు చంద్రమండలం వరకే వెళ్ళగల్గారు గాని హిరణ్యకశిపుడు సూర్య, నక్షత్ర మండలములను కూడా దాటాడు. అంతటి గొప్ప సైంటిస్టు దైవాన్ని ద్వేషించి, ధర్మాన్ని పాటించక తన కన్న కుమారుని కూడా హింసించాడు. కట్టకడపటికి పతనమైపోయాడు. సుగ్రీవుణ్ణి ఎందుకు అడవులకు పంపించావని వాలిని ప్రశ్నించినప్పుడు అతడు తన దోషాన్ని కప్పిపుచ్చుకుని, సుగ్రీవుడు తనకు మోసం చేశాడని చెప్పుకున్నాడు. బుద్ధిదోషముచేతనే వాలి ఈ విధమైన అసత్యానికి పాల్పడ్డాడు. అంబ కూడా తన దోషాన్ని కప్పిపుచ్చుకుని భీష్ముడు తనకు మోసం చేశాడని నిందించింది. వీరందరూ సామాన్యులు కావచ్చును. కాని, గొప్ప తపశ్శక్తి సంపన్నుడైన విశ్వామిత్రుడు కూడా బుద్ధిదోషముచేత ధర్మాన్ని విస్మరించి వశిష్ఠుల వారిపై ద్వేషాన్ని పూనాడు. ఈనాడు గొప్ప గొప్ప సైంటిస్టులు కూడా బుద్ధిదోషముచేత అసత్యాన్ని సత్యంగా, సత్యాన్ని అసత్యంగా ధర్మాన్ని అధర్మంగా, అధర్మాన్ని ధర్మంగా భావిస్తున్నారు.

బుద్ధిస్వరూపుడే గణపతి: మేధాశక్తి స్వరూపుడే గణపతి. జ్ఞానస్వరూపుడే గణపతి: సత్యస్వరూపుడే గణపతి. అతనికి వినాయకుడని కూడా పేరు కలదు. ఎందుకంటే, అతనికి మరొక నాయకుడు లేడు. అతనికి ఇంకొకరు సలహాలు ఇచ్చేవారు లేరు. **చెప్పినదే సత్యము. అతను చేసినదే ధర్మము కనుక, అతని వాక్యమును శిరసావహించడమే మానవుని కర్తవ్యము.** ఈనాటి మానవుడు తన మేధాశక్తి చాలా గొప్పదని విఱ్ఱవీగుతున్నాడు. అది ఎప్పుడు గొప్పదవుతుంది? ఆ మేధాశక్తిని స్కిల్ (skill) చేసినప్పుడే అది గొప్పదవుతుంది. అప్పుడే జీవితంలో చక్కని బేలన్స్ ఏర్పడుతుంది. కానీ, ఈ కలిప్రభావంచేత మానవుడు తన

మేధాశక్తిని కిల్(kill) చేస్తున్నాడు. అందుచేత తన జీవితంలో బేలన్స్(balance) తప్పిపోయి మానవునిలో బుద్ధి దోషము ఏర్పడింది. తనకు తోచినదే సత్యమని, తాను చేసినదే ధర్మమని భావిస్తున్నాడు. దీనికి తగిన ఫలితమును అనుభవించక తప్పదు. *(స.సా.స. 99.పు. 285/286)*

ఈ ప్రపంచమెచట నుండి ఎటుల వచ్చినదని యుగములు విచారించి నను తేలదు. ఏ విద్యవలననో ఎచ్చటి నుండియో వచ్చియుండినదో విచారణ ఫలితము ఉండును. కానీ, జగత్తు అట్టి విషయము కాదు. జగత్తు ఎట్లు కలిగెనను ప్రశ్న రజ్జు సర్పభ్రాంతి యందలి సర్పమెట్లు ఉద్భవించినదను ప్రశ్న తుల్యము. అచ్చట ఉన్నది త్రాడు. కాని దాని నుండి సర్పము ఉద్భవించెను. ఈ సర్పోద్భవ కారణము. చూచునట్టి వాని బుద్ధియందు గల దోషము అనగా భ్రమ లేక అజ్ఞానము. కావున స్పర్శ ఆవిర్భావ కారణము అజ్ఞానము వలన పుట్టెనను జవాబు యుక్తిసిద్ధము. పాము స్థానమున నున్నది జగత్తు. అనగా బ్రహ్మమునే మనము భ్రాంతి వలన జగత్తుగా తలచి వ్యవహరించుచున్నాము. ఇచ్చట కూడా చూచునట్టి వాని బుద్ధి దోషమునకు తీరదు. ఒక వస్తువును మరొక వస్తువుగా చూచుట బుద్ధిదోషమని తేలుచున్నది. బుద్ధి దోషమువలన భ్రాంతివలన జనించిన విషయ మెన్నటికి సత్యము కాదు. భ్రాంతి నశించిన తజ్జనిత విషయము కూడా నశించును. యదార్థము గోచరమగును.

*(జ.పు. 93)*

## దు:ఖమునకు కారణములు

మానవత్వంలో దుఃఖానికి మూలకారణమేమిటో మనం విచారించాలి. ఒక ఇంటిలో ఒకరి మృత్యువు సంభవించింది. ఇంటిలోని వారందరూ బాధపడుతున్నారు. కాని, ఈ బాధకు మృత్యువా కారణం? కాదు, కాదు. ఆ మరణించిన వ్యక్తిపై నుండిన **అభిమానమే** బాధకు మూలకారణం. అంతేకాదు ఏ ఇంటిలో మరణం సంభవించిందో ఆ ఇంటివారే దుఃఖిస్తారుకాని, మరెవ్వరూ దుఃఖించరే! మరణమే దుఃఖమునకు మూలకారణమైతే అందరూ దుఃఖించాలి కదా? కనుక, దుఃఖానికి కారణం మరణించిన వ్యక్తిపైనున్న అభిమానమేకాని, మరణం కాదు. అనగా అభిమానమే దుఃఖమునకు మూలకారణం కనుక, ఈ

**అభిమానమును క్రమక్రమేణ తగ్గించుకొంటూ రావాలి.** ఈ బాధ్యతల నుండి క్రమక్రమేణ తప్పించుకొంటూ రావాలి దీనినే వేదాంత పరిభాష యందు "వైరాగ్యము" అని చెపుతూ వచ్చారు. 'Less luggage, more comfort make travel a pleasure' అన్నారు. కనుక, మన జీవిత ప్రయాణంలో వాంఛలనే లగేజిని తగ్గించుకొంటూ రావాలి. ఐతే, వీటిని ఏవిధంగా తగ్గించుకోవాలి? **వాంఛలు లేక మానవుడు జీవించుటకు వీలుకాదే! కనుక వాంఛలను తగ్గించుకోవడమంటే వాంఛలలోని మమత్వాన్ని తగ్గించుకోవడమని అర్థం.**
*(స.సా.ఫి.95 పు. 30/31)*

నిజంగా దు:ఖమునకు కారణము జన్మ. జన్మకు కారణము కర్మ. కర్మకు కారణము పరిస్థితుల ప్రభావము. పరిస్థితుల ప్రభావమునకు కారణము బుద్ధి. బుద్ధికి కారణము ద్వైతము. ద్వైతమునకు కారణము అజ్ఞానము. కావున అజ్ఞానమే దు:ఖమునకు కారణము. దృష్టి ఎప్పుడైతే జ్ఞానమయమవుతుందో, అప్పుడు సృష్టి అంతా బ్రహ్మమయంగా గోచరిస్తుంది. *(శ్రీ.భ.ఉ.పు.12)*

## సుఖము

జీవితంలో కేవలం సుఖం మాత్రమే ఉండాలని ఆశించరాదు. "నసుఖాత్ లభ్యతే సుఖమ్" సుఖము నుండి సుఖము రాదు. దుఃఖము నుండే సుఖము ప్రాప్తిస్తుంది. *(స.సా.మా 96 పు. 57)*

ప్రతి ప్రాణి ప్రపంచములో సుఖమునే కోరును. దుఃఖము కోరదు. వాస్తవమైన సుఖము ఏమిటో తెలిసినవారు, తెలిసికొన్న వారు చాలా అరుదు. సుఖము మూడు రకములుగా యున్నది. ఆరంభమున విషయమువలె యుండి, విపాకము నందు అమృతమువలె యుండును. ఇది ఆత్మబుద్ధిచేత లభించు సుఖము. యోగవాసిష్ఠములో, ఓ రామా! మహాసముద్రమునైనా తేలికగా పానము చేయవచ్చును. మేరు పర్వతమునైనా తేలికగా ఊడపెరకవచ్చును అగ్నిని అనాయాసంగా భుజించవచ్చును. కాని మనో నిగ్రహమును గాంచితిమా అదే అమృతత్వము. **అట్టి అమృతత్వమును పొందుటకు పూర్వము అతి శ్రమయనక మనో నిగ్రహమునకై ప్రయత్నించుట ప్రధాన సుఖము.**

విపాకముగా నిర్వికల్ప సమాధిలో లభించు సుఖము వర్ణనాతీతము. ఇది అమృతముతో సమానము. నిర్వికల్పమనగా సంకల్పరహిత స్థితియే. వికల్పము లేనిది నిర్వికల్పము. దీనిని సాధనచే సాధింపవచ్చును. నిర్వికల్పసమాధి రెండు విధములు. ఒకటి అద్వైత భావరూపము. రెండవ ద్వైతావస్థ రూపము. దీనినే నిర్వికల్పసమాధి అంటారు. దీనిని సాత్విక సుఖము అని కూడా అంటారు. "నసుఖాల్లభ్యతే సుఖం" సుఖము నుండి సుఖము చిక్కదు. కష్టములోనే సుఖమున్నది అన్న సత్యాన్ని గుర్తించాలి. *(సా.పు.252)*

**సుఖదుఃఖములు**

సముద్ర కెరటాలవలె సుఖదుఃఖాలు వస్తూపోతూ ఉంటాయి. అవి ఉచ్ఛ్వాస నిశ్వాసముల వంటివి. వాటితో ఉంటూ ప్రశాంతిని మీరు పొందగలిగితే మీరున్నచోటే కాశి అవుతుంది. మీరు చేసే ప్రతి పని శివపూజ అవుతుంది. మీరు మీ మనస్సుతో పాటే సంచరించండి. దాని భావాలు, రహస్యాలు మీకు అర్థమవుతాయి. మీ సామ్రాజ్యాలకు మీరు అధికారులు కాకుండగా ఇతర దేశాలలో సంచరిద్దామని భావించకండి. ముందు మీ సంగతి, తరువాత ఇతరుల సంగతి. మిమ్మల్ని మీరు తెలుసుకోండి. ఈపాఠం ఒక్కసారి నేర్చుకుంటే మీరు ఇతరులను వేగంగా స్పష్టంగా తెలుసుకోవచ్చు. *(వ.61-63 పు.182)*

**దుర్జనులు, దుర్భావములు, దుర్గుణములు , దురాచారములు**

కొలది కొలదిగ పుట్టును తొలుత చెదలు
కొఱికి తినివేయు త్వరలోన కొయ్యనంత
దుర్గుణంబులు సూక్ష్మమై తొలుచు తొలుత
పిదప నాశనంబు చేయు నే పెద్దనైన. *(సుబోధ - పు.98)*

భస్మాసురుడు తాను చేయి పెట్టిందల్లా భస్మమైపోవాలని ఆశించాడు. కాని, కట్టకడపటికి ఏమైంది? తన హస్తం తననే భస్మం చేసింది. అదేరీతిగా, ఎవరి దుర్గుణాలు వారినే బాధిస్తాయి; భస్మం చేస్తాయి. కనుక, మీరు పరులలోని దుర్గుణాలను గురించి యోచించకూడదు. పరులను దూషించేవాడు పాపి; పరులను గౌరవించేవాడే పుణ్యుడు. **"సర్వజీవ నమస్కారం కేశవం ప్రతి గచ్ఛతి".**

అట్లే. **“సర్వజీవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి”.** ఎవరిని విమర్శించినా మీ దేవుణ్ణి మీరు విమర్శించినట్లే: ఎవరిని గౌరవించినా మీ దేవుణ్ణి మీరు గౌరవించినట్లే. భగవద్గీతలో కృష్ణుడు చెప్పినట్లు, **దేహమే దేవాలయం, జీవుడే ఇందులోని దేవుడు. కనుక, మానవుడు ఏ దేహాన్ని చూసినా దేవాలయాన్ని చూసినట్లుగా భావించి గౌరవించాలి. అప్పుడే తన జీవితం సార్థకమౌతుంది.** ఇతరులు కూడా తనను గౌరవిస్తారు. కాని, ఈనాటి మానవునిలో అట్టి విశాల భావాలు అడుగంటి పోయాయి. తాను ఇతరులను గౌరవించడుగాని, తనను అందరూ గౌరవించాలని ఆశిస్తున్నాడు. ఇది అసాధ్యం.

*(స.సా.అ. 2000 పు.299/300)*

దయ్యంగాని భూతంగాని ఈ జగత్తులో సృష్టించబడలేదు. వీటిని మానవుడు తనకు తానే సృష్టించుకొంటున్నాడు, అని భగవాన్ ఒక ఉదాహరణ చెప్పారు పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో కృష్ణుడొకనాడు వారియొక్క స్థితిగతులను గురించి, యోగక్షేమాలను గురించి తెలుసుకోవాలని అరణ్యానికి వెళ్ళి వారితో ఒక రాత్రి గడిపాడు. పాండవులు తమమధ్య పాంచాలి కూడా ఉండడంచేత ఆమెను సంరక్షించే నిమిత్తమై ప్రతి రాత్రి ఒక్కొక్కరు ఒక్కొక్క గంటసేపు తాము ఉన్నటువంటి పర్ణశాల చుట్టూ పహారా చేస్తూ వచ్చారు. మాటల సందర్భంలో కృష్ణుడు ధర్మజునిద్వారా ఈ విషయం తెలుసుకొని బావా! ఈ రాత్రి నాకు కూడా ఒక గంటసేపు ఈ డ్యూటీ చేసే అవకాశం ఇస్తావా?'' అని అడిగాడు. ధర్మజుడు నవ్వుతూ ''కృష్ణా! సర్వలోకములను రక్షించే మీకు ఈ విధమైన వాంఛ ఎందుకు కల్గిందో నాకు అర్థం కావటంలేదు. పైగా, ఈ అడవిలో ఒక భయంకరమైన దయ్యం ఉన్నది. దానిని ప్రతిరాత్రి నేను చూస్తున్నాను. నా సోదరులు కూడా చూస్తూన్నారు. అది మాతో యుద్ధం చేయడానికి ప్రయత్నిస్తున్నది. మీరు గనుక వెళ్ళినట్లయితేఅది మిమ్మల్ని కూడా బాధించవచ్చు. మీరు మా యోగక్షేమాలను చూసే నిమిత్తమై ఇక్కడకు వచ్చారు. కాబట్టి మీరు క్షేమంగా, ఆనందంగా నిద్రించండి” అని కోరాడు. అప్పుడు కృష్ణుడు “ధర్మజా! ఇంతకాలమైనప్పటికీ నన్ను ఇంత మాత్రమేనా తెలుసుకున్నావు! ఒకవైపున నన్ను నేను

రక్షించుకోలేనటువంటి అబలునిగా భావిస్తున్నావు : ఆ దయ్యం నన్ను ఏవిధమైన బాధలకు గురి చేస్తుందో అని భయపడుతున్నావు. ఏ దయ్యంగాని ఏ భూతంగాని నన్నేమీ చేయలేవు. కనుక మీరందరూ చేస్తున్నట్లుగా ఈ పర్ణశాలను సంరక్షించ డానికి నేను కూడా ఒక గంట డ్యూటీ తీసుకుంటాను" అన్నాడు. సరే కృష్ణునికి కూడా డ్యూటీ ఇచ్చారు. కృష్ణుడు ఆ ఒక్కగంట పర్ణశాల చుట్టూ తిరిగాడు. తరువాత అర్జునుని వంతు వచ్చింది. 'కృష్ణుణ్ణి ఆ దయ్యం ఎన్ని బాధలు పెట్టిందో ఏమిటో' అని భయపడుతూ అర్జునుడు కృష్ణునివద్దకు పరుగెత్తుకొని వెళ్ళాడు. కానీ కృష్ణునికి ఏ బాధలూ లేవు. ఒక రాతిపైన కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ కనిపించాడు. అర్జునుడు పరుగెత్తుకొని పోయి కృష్ణుని పాదాలపై పడి 'స్వామీ! ఆ దయ్యం మిమ్మల్ని ఎంత బాధ పెట్టిందో ఏమిటో! అయితే దానిని మీరు హతమార్చినారు కాబోలు కనుకనే ఇంత సంతోషంగా కనిపిస్తున్నారు" అన్నాడు. అప్పుడు కృష్ణుడు 'అర్జునా! నా సృష్టిలో దయ్యాలు, భూతాలనేవి లేవు. వాటిని నేను సృష్టించలేదు. సృష్టిలోనే లేని దయ్యం ఈ అడవిలో ఏవిధంగా ప్రవేశించగలదు? ప్రతిరాత్రి మీకు కనిపించేది దయ్యం కాదు. మీ యందున్న క్రోధమే మీకొక దయ్యంగా కనిపిస్తున్నది. దానిని చూసి మీ క్రోధం మరింత పెరిగిపోతున్నది. మీ క్రోధం బలపడే కొలది ఆ దయ్యం కూడా తన స్వరూపాన్ని పెంచుకొంటున్నది' అన్నాడు. మానవుని యందున్నటు వంటి దుర్గుణములు, దురాచారములు దుర్భావములే దయ్యము. పిశాచము వంటి రూపాలను ధరించి మానవుణ్ణి బాధ పెడుతున్నాయి. భక్షిస్తున్నాయి. ఇవన్నీ ఇమేజినేషన్లే. 'నాసృష్టియందే ఈ దయ్యాలు, భూతాలు లేవు. ఇవన్నీ మీభావములు సృష్టించుకొన్ని స్వరూపములే" అన్నాడు కృష్ణుడు. ఆ మాటలచేత అర్జునుడు చక్కగా ధైర్యం తెచ్చుకున్నాడు. ఈ తరువాత అతనికి ఎక్కడా ఏ దయ్యమూ కనిపించలేదు. "కృష్ణా! ఈ దయ్యాలు, భూతాలు మా భావాల యొక్క ప్రతిబింబాలేనన్న సత్యాన్ని మాకు ప్రబోధించే నిమిత్తమే మీరీనాడు మావద్దకు వచ్చారు. ధన్యులం. ధన్యులం" అని కృష్ణుని పాదాలకు నమస్కరించాడు." *(స.సా.మా99పు. 57/58)*

మనుజుడైవాడు, మంచిగా తనలోని
దుర్గుణములు మొదట త్రుంచవలయు

పశుగుణంబులు వీడి, పశుపతి కావలె
సత్యమైన బాట సాయి మాట. *(సా.పు. 583)*

## సద్గుణములు

"ఉత్సాహం సాహసం ధైర్యం, బుద్ధి శక్తి: పరాక్రమ:
షడేతే యత్ర తిష్ఠన్తి తత్ర దేవస్సహాయకృత్".

ఏ రంగమునందైననూ, ఏ కాలమునందైననూ, ఏ మానవుడైననూ ఈ ఆరు సద్గుణములు కలిగినటువంటి వాడు సర్వత్రా విజయమునే సాధిస్తాడు. ఈ సద్గుణములే మానవుని సకలైశ్వర్య సంపన్నుని గావిస్తాయి. ఈ సద్గుణములు కలిగినటువంటి మానవుణ్ణి సర్వ విజయములూ వరిస్తాయి. అయితే ఈ సద్గుణములకు అనేక విధములైన అవాంతరములు అడ్డు తగులుతూ ఉంటాయి. అవాంతరములు, కష్టములు, నష్టములు, విచారములు ఇవి ఒకవిధంగా తమ భవిష్యత్తుకు ఉన్నత సోపానములే. వీటినన్నింటిని ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని తట్టుకొని, నెట్టుకొని ముందుకు సాగిపోవటం నేర్చుకోవాలి.
*(శ్రీ.మా.97. పు.5)*

సద్గుణంబులు సద్బుద్ధి సత్యనిరతి
భక్తి క్రమశిక్షణ కర్తవ్య పాలనములు
నేర్పునదే విద్య విద్యార్థి నేర్వవలయు. *(బృ.త్ర. పు.179)*

ఈ విద్య అందురు నేర్చుకొనవలెను.

## దుర్మార్గమైన మార్గం

మానవులు ఏదో సుఖించాలని తమ సుఖము కోసం అనేకమైన పెడమార్గములకు పోవుచున్నారు. ఆధునిక యుగమందు ఆంగ్ల విద్యా ప్రభావముచేత విద్యార్థుల తత్త్వములు, విద్యావంతుల ప్రభావములు వికారమార్గమును అనుసరిస్తున్నాయి. మీ అందరికీ తెలుసు. అనేకమంది అధికారులు ఆఫీసులకు పోతారు. తమ తమ పనులు తాము చేస్తూ ఉంటారు. ఏదో పెద్ద శ్రమపడి వచ్చినట్లుగా ఇంటికి వస్తారు. మాకు సుఖము లేదు– మాకు శాంతిలేదు అని అనుకుంటారు. ఆఫీసు పనులు చేసి, మా వ్యాపారము

పనులుచేసి, మా కర్తవ్యకర్మలు ఆచరించి, మాకు ఏమాత్రము సుఖ–శాంతులు లేకుండా ఉంటున్నాయని వాపోతారు. ఇంటికి వచ్చిన వెంటనే డ్రస్సులు విసర్జించి, ఇంకొక డ్రస్సులు ధరించి హేపీ నిమిత్తమై క్లబ్బులకు వెళుతారు. దేనికోసం వెళుతున్నారు? అని ప్రశ్నిస్తే – "సంతోషము కోసము పోతున్నాము. రెస్ట్ కోసము పోతున్నాము" అని జవాబు చెబుతారు. అక్కడ నిజంగా సంతోషం దొరుకుతుందా? శాంతి లభిస్తుందా? అక్కడ సుఖమున్నదా? ఆ క్లబ్బులకుపోవటం, కార్డ్సు ఆడటం, మత్తుపదార్థములు తీసుకోవటం మున్నగునవి చేస్తారు. ఇవి కేవలము ప్రపంచమునే మరచిపోయి కూర్చోవటమని చెప్పవలె. ఇవన్నీ సుఖ–శాంతి నిమిత్తమై ఆచరించే సత్కర్మలుగా భావిస్తారు. ఇది చాలా దుర్మార్గమైన మార్గం. ఈ సుఖము సుఖమనే అపేక్షతో, వారు దుఃఖమును కొనుక్కొంటున్నారు. వారికి వారు చెడిపోవడమే కాక, వారు సమాజాన్ని కూడా చెడగొట్టుచున్నారు. ఇది మొదటచాలా సుఖముగానే కనిపిస్తుంది. కానీ, ఇది పోను పోను క్రమక్రమేణా ఎక్కడికి దిగజారుతుందంటే

*First the man drinks the Wine*
*second the Wine drinks the Wine*
*Third the Wine drinks the Man.*

ఈ రీతిగా, మానవుడు పతనము పొందుతాడు. కేవలము 'తాను–తాను' తీసుకుంటున్నానని భ్రమిస్తున్నాడు. కాదు కాదు. అదే తనను తీసుకుంటున్నది. ఈ విధమైన శాంతినికోరే పెడమార్గమును పట్టి జీవితమును భ్రష్టు పట్టించుకొంటున్నారు. *(స.సా.అ.90. పు.272/273)*

## దుర్వాసనలు

హృదయమును వీడి దుర్గుణములు యెపుడు కదలిపోవునో అపుడు వాటికి పరివారముగా అనుసరించిన దుర్వాసనలు కూడనూ వాటితోపాటు, గూడూ గుడారములు యెత్తివేసి ఉత్తచేతులతో పత్తా లేకుండా పారిపోవుదురు. అపుడు మానవుడు తన నిజస్వరూప స్వభావములైన సాయుజ్యమును పొందును: మాయను వీడును; మనసును బాయును; మర్మము నెరుగును: మాధవత్వమును గాంచును. *(భా.వా. పు.7)*

## రాజ్యాధికారులు

కుటిలచిత్తుడు రాజ్యమునేలిన భూమి పాతాళమునకు క్రుంగును. స్వార్థపరులు, సంకుచితచిత్తులు, దురాశాపరులు, ఆడంబరజీవులు, అహంకార వ్యక్తులు, అసూయాస్వభావులు రాజ్యాధికారులు కారు. అట్టి వారల పరిపాలన ప్రజలకు హాని కలిగించును. ధర్మమును నాశనము చేయును. దేశమునకే కీడు వాటిల్లును. సదాచార, సచ్ఛీల, త్యాగ, సత్యవాక్య పరిపాలకులే రాజ్యాధికారులు. *(రా.నా.మొ.పు.315)*

## దుస్సంగము

చెడ్డవానిని చూసినప్పుడు మీలోని చెడ్డ జ్ఞాపకం వస్తుంది. మంచివానిని చూసినప్పుడు మీలోని మంచితనమంతా బయటపడుతుంది. కాబట్టి, అందరితో **స్నేహం చేయకూడదు.** స్నేహం చేసే ముందు మంచి, చెడ్డలు విచారణ చేయాలి. భగవంతుడొక్కడే మీ నిజమైన స్నేహితుడు. మీకందరికీ తెలుసు – కృష్ణుని స్నేహంచేత కుచేలుడు ఎంతటి ఉన్నతస్థాయిని పొందాడో! అలాంటి స్నేహం ఈనాడు ఎక్కడా కనిపించడం లేదు. మీ జేబులో నోట్లు కనిపిస్తే అందరూ 'హలో, హలో' అంటూ దగ్గరికి వస్తారు. మీ జేబులు ఖాళీ అయితే మిమ్మల్ని తప్పించుకుతిరుగుతుంటారు. ఇలాంటిది స్నేహం ఎలా అవుతుంది? **రెండు దేహాలు, ఒక్క ప్రాణంగా జీవించాలి. అదే నిజమైన స్నేహము. "త్యజ దుర్జన సంసర్గం",** దుస్సంగమునకు దూరంగా ఉండండి. దుస్సంగములో చేరితే మీరు కూడా దుర్మార్గులుగా తయారౌతారు. కనుక, 'భజ సాధు సమాగమం", సత్సంగంలో ప్రవేశించండి. "కురు పుణ్య మహోరాత్రం", రాత్రింబవళ్ళ పుణ్యకార్యము లాచరించండి. మంచి గుణములచేత మంచి పేరు తెచ్చుకోండి. ఆదర్శ మానవులుగా బ్రతకండి. ఇదియే ఈ స్నాతకోత్సవంలో స్వామి మీకు అందించే సందేశం. దైవాన్ని మాత్రం మరువకండి. దైవమే మీ ప్రాణము. దైవమే మీ సర్వస్వము. కనుక, దైవాన్ని హృదయంలో పెట్టుకొని సేవలో ప్రవేశించండి. తప్పక మీకు అన్నింటియందు జయమే కలుగుతుంది. అన్నింటియందు మీరు విజయం పొంది ఆనందమయమైన జీవితాన్ని గడపాలని నేను ఆశిస్తున్నాను. *(స.సా.జ 2000 పు. 20/21)*

## దుస్సంగము

దుస్సంగానికి దూరంగా వుండాలి. దుస్సంగములో చేరితే మీలో పవిత్రమైన భావములు నిర్మూలమైపోతాయి. కైక మంథర మాటలను వినడంచేత తన స్వంత కుమారుడైన భరతుని కన్నమిన్నగా ప్రేమించిన రాముణ్ణి అరణ్యానికి పంపించింది. మంథర మాటలచేత ఆమె బుద్ధిలో మార్పు కలిగింది. అనగా, బుద్ధి దోషము కల్గినప్పుడు అసత్యం సత్యంగా గోచరిస్తుంది. సంగదోషముచేత బుద్ధిదోషం ఏర్పడుతుంది. కనుకనే, నేను అప్పుడప్పుడు పిల్లలకు చెపుతుంటాను. ఇతరులతో ఎక్కువగా కలవకండని. చిన్న వయస్సునుండియే దుస్సంగానికి దూరంగా ఉండాలి. సత్సంగంలో చేరాలి. అహోరాత్రములు పుణ్య కార్యముల నాచరించాలి. నిత్యానిత్య విషయ పరిశీలన చేయాలి.

*(స.సా.న.1999 పుట. 288)*

## దుర్మార్గము/దుర్మార్గులు

నిగమములు హరించి నిండు దూషణచేసి
సోమకాసురుడేమి సుఖము నొందె
పరసతి నాసించి పది తలలవాడేమి
పట్టుకుపోయెను గట్టిగాను
ఇల సూది మొనమోప ఇయ్యజాలనటన్న
దుర్యోధనుడేమి దోచుకొనియె
పసి పాపలను కూడ పసికట్టి చంపిన
కంసుడే పాటి కాచుకొనియె
నేటి దుర్మార్గులకు కూడ యిదియె గతి
సత్యమును తెల్పుమాట ఈ సాయి మాట *(సా.పు.526)*

## దుష్టులు

ఈనాటి నుండి స్త్రీలు పురుషులు కాని ఇతరుల తప్పు పెద్దదైననూ చిన్నదిగా తీసుకోండి. మీ చిన్న తప్పును పెద్దదిగ భావించండి. అప్పుడింక తప్పులే చేయరు. పరులలో ఉన్న మంచిని చూడండి. పరులలో ఉన్న మంచిని చూస్తే మీరు కూడా బాగుపడగలరు. మీలో ఉన్న చెడును చూస్తే మీరు

సరిదిద్దుకోగలరు. కాని, ఈనాడు పరులలో ఉన్న తప్పులనే వెతుకుతున్నారు. తెలుగులో ఒక సామెత ఉంది. “దుష్టులు తప్పులను వెతుకుతారు. కుక్క చెప్పులను వెతుకుతుంది”. దుష్టునికి కుక్కకు ఏమీ వ్యత్యాసం లేదు. కనుక మీరు కుక్కలు కాకూడదు. డాగ్ కాకూడదు. గాడ్ కావాలి. మనం చక్కదిద్దుకొని, తిరిగి అలాంటి తప్పులు రాకుండా చూసుకోవాలి. మనం ఏ తప్పు చేసినప్పటికీ దాని ఫలితం మననే బాధిస్తుంది. ఎవరికో చెడ్డ చేస్తున్నామని భావించరాదు. మనకు మనమే చెడ్డ చేసుకుంటున్నాము. మనమే చెడిపోతున్నాము. మనకు చెడ్డ పేరు సంపాదించుకుంటున్నాము. కనుక, మనమంతా మంచి మనసుతో జీవించాలి. *(శ్రీ.భ.ఉ.పు. 185/186)*

## దుష్ప్రచారాలు

ప్రాచీనకాలంలో అనేకమంది మహనీయులు ప్రపంచానికి ఆదర్శమును అందించుటకు అనేక బాధల ననుభవించారు. ఎన్ని కష్టనష్టములెదురైనను వారు తమ దీక్షను విడనాడలేదు. అట్టి ఆదర్శమూర్తులలో ఒకడైన జీసస్‌యొక్క తత్త్వాన్ని ఈనాడు మీరు జ్ఞాపకం చేసుకోవాలి. జీసస్ జన్మించిననాటినుండి అనేకవిధములైన కష్టములకు నష్టములకు గురియౌతూ వచ్చాడు. తరతరాలనుండి, యుగయుగాలనుండి ఇలాంటి మహనీయులు, మహత్తరమైన శక్తి సంపన్నులు. దివ్యమైన భావములచేత ప్రజలకు ఉపదేశములు చేస్తూ ఉపకారములు సల్పుతూ జగత్తును ఉద్ధరించుటకు పాటుపడ్డారు. కాని, మూర్ఖులైన మానవులు వారి చర్యలలోని అంతరార్థమును గుర్తించలేక ఆ మహనీయులను, వారి ఆధ్యాత్మిక తత్త్వమును అవమానపరుస్తూ వచ్చారు. ఉత్తమ పురుషులయొక్క దివ్యత్వం జగద్వ్యాప్తి అయినప్పుడు అనేకమందికి అసూయ బయల్దేరుతుంది. **అసూయ, అనసూయ ఇరువురూ అక్కచెల్లెళ్ళు.** అసూయ యొక్క పుత్రులు జీసస్‌ను అనేకవిధములుగా హింసించారు. సమాజానికి శాంతి భద్రతలనందించగోరి జీసస్ అనేకపాట్లుపడ్డాడు. బీదసాదలను, కష్టజీవులను కరుణతో ఆదుకున్నాడు. జీసస్ చేసే పవిత్ర కార్యములను చూసి సహించుకోలేక కొంతమంది అతనిని అనేక ఇక్కట్లకు గురి చేస్తూ వచ్చారు. దినదినమునకూ అతనిపై **ద్వేషం** పెంచుకున్నారు. అతని పేరు ప్రఖ్యాతులు

పెరిగిపోతున్నాయన్న **అసూయతో అర్చకులు కూడా అతనికి విరుద్ధంగా ప్రచారం చేస్తూ వచ్చారు.** బెస్తవారు మాత్రం అతనికి శిష్యులై, అతనిని ప్రేమిస్తూ, ఆరాధిస్తూ వచ్చారు. ఓర్వలేనివారు అతనికి అనేక ఆటంకములు కల్పించి బాధలు పెట్టారు. కట్టకడపటికి అతని ప్రాణం తీయటానికి కూడా పాల్గొన్నారు. జీసస్‌కు పన్నెండు మంది శిష్యులుండేవారు. వారిలో పన్నెండవవాడు జూడాస్. ఆనాడు ఒక్క జూడాస్ ఉండినాడు. ఈనాడు అనేకమంది జూడాస్‌లు బయల్దేరినారు. కనుకనే. జగత్తులో అశాంతి పెరిగిపోయింది. కొంతమంది అసూయపరులు అల్పబుద్ధి గల జూడాస్‌కు ధనాశ కల్పించి అతనిని లోబర్చుకున్నారు. కేవలం కొన్ని వెండి నాణెములను ఆశించి జూడాస్ తన గురువుకు ద్రోహం చేశాడు. "ధనమూలం మిదం జగత్" అనే భావన ప్రజలలో రెండువేల సంవత్సరములకు పూర్వమే ప్రారంభమైంది. *(స.సా.జ.2001, పు.1/3)*

## దుష్టగుణములు

క్రూరమృగము తెచ్చి కూర్మితో పెంచిన
ఆకలయ్యేనేని అదిమి పట్టు
దుష్టగుణములు కల దుర్జన స్నేహంబు
క్రూర మృగము కంటె ఘోరమగును. *(సుబోధ – పు.98)*

## దుష్టసంకల్పము

దుష్ట సంకల్పముచేత దుఃఖితుడగు
సత్య సంకల్పముచేత సాధువగును
సకల సంకల్పరహితుడే శాంతి పొందు
ఇంతకన్నను వేరెద్ది ఎఱుక పరతు? *(స.సా.డి.96 పు.325)*

## దుర్బుద్ధులు

దుర్బుద్ధులు తలనున్న
దూరులు విను చెవులున్న
పొంచి చూచు కనులున్న
వంచించె మనసున్న

ఈ వికృతులను చూడగానె
విద్య ఇక బ్రతుక దన్నా. *(స.సా.డి.96 పు.321)*

రామునికంటె రావణుడే ఎక్కువ విద్యలు చదివాడు. అయితే రాముడు నేర్చిన విద్యలను అచరణలో పెట్టి జీర్ణించుకున్నాడు. కనుకనే అవి అతనికి శక్తిని, పుష్టిని అందించాయి. కాని రావణుడు తాను నేర్చిన విద్యలను ఆచరణలో పెట్టకపోవడం వలన 'అజీర్ణరోగం' బయలు దేరింది. 'అజీర్ణరోగం' వల్ల అన్నీ అప్రమాణ బుద్ధులే అభివృద్ధి అయినాయి. దేహానికి కడుపే కేంద్రము. కడుపు చెడిపోతే దేహమంతా చెడినట్లే! అదేవిధంగా తలలో దుర్బుద్ధులు ప్రవేశిస్తే జీవితమే నాశనమవుతుంది. *(శ్రీ.భ.ఉ.పు.84)*

ప్రతి మానవుడు తన మనస్సునందు, మాటలందు, కర్మలందు పవిత్రతను కల్గియుండాలి. దీనినే..మానవత్వం అన్నారు. మానవత్వ మంటే ఏమిటి? హృదయము, వాక్కు, పని ఈ మూడింటి ఏకత్వము కావాలి. హృదయములో ఏది ఉద్భవిస్తున్నదో దాన్ని వాక్కులో చెప్పాలి. ఏది వాక్కులో చెప్పావో అది చేత్తో చేయాలి. ఈనాడు హృదయములో ఉద్భవించేది ఒకటి. నోటితో చెప్పేది ఒకటి. చేత్తో చేసేది మరొకటి. (అలాంటి వారు దురాత్ములు)

**మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్**
**మనస్సన్యత్ వచస్సన్యత్ కర్మణ్యన్యత్ దురాత్మనామ్**

మీరందరు మహాత్ములు కావాలి. మీకు మహత్తరమైన మానవ జన్మ లభించింది. ఈజన్మ చాలా పవిత్రమైనది. 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. ఈ జన్మకున్న విలువ మరి దేనికీ లేదు. మానవజన్మ కున్న కీర్తి మరొక దానికి లేదు. మానవ జన్మకున్న స్థాయి మరొక దానికి లేదు.
*(ద.స.1998 పు.60)*

బుద్ధి అనే సూర్యుని చేత దుర్భావాలనే సముద్రజలాన్ని సద్భావాలనే ఆవిరిగా మార్చుకొని, సత్యమనే మేఘం నుండి ప్రేమజలం కురుస్తుంది. చివరికి అది అనుగ్రహసాగరంలో లీనమైపోతుంది.

*(స.సా.జూలై 2000 పు.196)*

మానవుడు సర్వశ్రేష్ఠమైన దైవత్వాన్ని పొందుటయే ఉత్తమ మార్గం. అట్టి దైవత్వాన్ని పొందుటకు సాధ్యం కానప్పుడు, కనీసం మానవత్వాన్నైనా అభివృద్ధి పరచుకొని, జీవితాన్ని సార్ధకం చేసుకోవాలి. అంతేగాని మానవుడు దానవుడుగా లేక పశువుగా మారుట ధర్మ విరుద్ధం. ఈనాడు ఇట్టి ధర్మ విరుద్ధమైన చర్యలు జగత్తునందు వ్యాపించి ఉండుట చేత మానవత్వమే మరుగున పడిపోతున్నది. నీతి నిజాయితీలు, సంఘమర్యాదలు శూన్యమైపోయినవి. మానవుడు 'సంఘము' అనే పదాన్ని సరిగా అర్ధము చేసికొనలేక, జీవితాన్ని వ్యర్ధం చేసుకుంటున్నాడు. కేవలం మనుష్యుల యొక్క చేరికయే సంఘము అని భావిస్తున్నాడు. కాదు, కాదు. అనేకత్వములో ఉన్న ఏకత్వాన్ని గుర్తింపజేయునదే సంఘము. అందరూ కలసి ఏకకాలంలో ఏక కర్మను ఆచరించి ఆ కర్మఫలితాన్ని ఏకాత్మభావంతో అనుభవించాలి. ఇదే సంఘము యొక్క ప్రధానమైన ధర్మం. నిజమైన సుఖమే సంఘము యొక్క ప్రధానమైన ధర్మం. నిజమైన సుఖాన్ని సంఘము ద్వారానే అనుభవించడానికి సాధ్యమౌతుందనే సత్యాన్ని మానవుడు గుర్తించాలి. ఇదే 'సంఘం' యొక్క అంతరార్ధం, **అనగా మానవుని సుఖ - సంతోషాలన్నీ సమాజము** పైననే ఆధారపడి ఉంటాయి. సంఘమే లేకుండిన మానవుడే లేడు.

*(స.సా.న.1991 పు.299)*

శివరాత్రి అనగా ఏమిటి? పవిత్రమైన భావాలను పోషించునదే శివరాత్రి; దివ్యమైన ప్రేమను అభివృద్ధిపర్చునదే శివరాత్రి. దుర్గుణములను, దురాలోచనలను, దుర్బుద్ధులను దూరం చేయునదే శివరాత్రి. కనుక సత్యాన్ని గుర్తుంచుకొని సత్యమైన మార్గంలో ప్రవేశించండి. మనస్సు చంద్రునితో పోల్చబడింది. చంద్రునికి 16 కళలున్నాయి. వీటిలో ఈరాత్రి పదిహేను కళలు దైవంలో లీనమైపోయి, ఇంక ఒక్క కళ మాత్రమే మిగిలి ఉంటుంది. దైవాన్ని స్మరించడం చేత ఆ ఒక్క కళ కూడా దైవంలో లీనమై పోతుంది. కనుక సంవత్సరమునకు ఈ ఒక్క రాత్రంతా భజన చేసినారంటే ఎంతో అదృష్టవంతులవుతారుమీరు. సంవత్సరంలో ఒక్క రాత్రియైనా మేలుకొని దైవచింతన చేయగలరా? భజనలోని ఆనందం భగవన్నామంలోని మాధుర్యం

ఇంకెక్కడా చిక్కదు. ఎంత ఖర్చు పెట్టినా లభించదు. ఇది కేవలం ప్రేమచేతనే లభ్యమవుతుంది. కనుక ప్రేమను పెంచుకోండి. పవిత్రతను పెంచుకోండి. జీవితాన్ని సార్ధకం గావించుకోండి. *(స.సా.మా. 99. పు.66)*

## సంగము

నీవు ఎలాంటివాడివో చెప్పాలంటే నీ సంగమెలాంటిదో తెలుసుకుంటే చెప్పవచ్చు. కనుకనే ఐన్‌స్టీన్ చెప్పాడు. Tell me your company I shall tell you what you are అని. కనుక మనయొక్క మంచిచెడ్డలు కేవలం సంగముతోనే ఏర్పడుతూ ఉంటాయి.

భుజబలంబు, మంచి బుద్ధిబలంబుండి
దైవ బలము లేక దాసుడగును
కర్ణుడంతటివాడు కడపటి కేమయ్యె
మరచిపోకు డిట్టి మంచిమాట.

కర్ణుడు మహాబలశాలి. మహాబుద్ధిమంతుడు. మహా శక్తిమంతుడు. కాని దుర్మార్గులైన దుర్యోధన దుశ్శాసనుల సహవాసముచే దైవాన్ని విస్మరించి, దుస్సంగాన్ని విశ్వసించి దుష్టచతుష్టయములో ఒకడైపోయాడు. దైవమును దూరము గావించుకున్నాడు. దైవ బలమున్నప్పుడు సర్వబలములూ చేకూరుతాయి. ధర్మ బలమున్నప్పుడే సర్వ బలములూ చేకూరుతాయి.

*(స.ది.పు. 97)*

## సత్సాంగత్యము

సత్సాంగత్యముచేతను, మహనీయుల సందర్శనముచేతను, వారి దివ్యబోధనలను ఆలకించుటచేతను, భగవదనుగ్రహముచేతను మీ మనో ప్రవృత్తులు మారవచ్చును. అంగులీమాలునికి బుద్ధభగవానుని దర్శన సంభాషణలచేత జ్ఞానోదయం కలిగింది. రత్నాకరుడు నారద మహర్షియొక్క ప్రబోధనలచేత వాల్మీకి మహర్షిగా మారిన ఉదంతము మీకు తెలియనిది కాదు. క్షాత్ర ధర్మమును విస్మరించి ధర్మపరిరక్షణమనే కర్తవ్యాన్ని మరచి తమోగుణముచే విచారగ్రస్తుడై వ్యర్థ ప్రసంగము చేయుచున్న పార్థునికి కృష్ణుడు గీతబోధ ద్వారా

కర్తవ్యాన్ని గుర్తుచేసి కురుక్షేత్ర సంగ్రామమును నడిపించిన సంగతి మీరెంరింగి నదే. జనకుడు యాజ్ఞవల్క్యుని బోధనలచే సంపూర్ణ వైరాగ్యమును పొంది, దివ్యత్వమును అనుభవించి, శుద్ధ సత్వగుణ ప్రధానుడై జ్ఞానిగా నిలిచినాడు. రజోగుణసంపన్నుడైన విశ్వామిత్రుడు వశిష్ఠుని శరణుజొచ్చి, సత్వగుణ శోభితుడై బ్రహ్మర్షి అయినాడు. ఈ ప్రకారం మీరు సాధనద్వారా భగవదను గ్రహమును పొంది మీ జీవితాన్ని సార్థకం చేసుకోవచ్చును.

*(స.సా.డి.99. 375)*

## సత్పురుషులు-దుర్మార్గులు-తారతమ్యము

వేదపురాణములలో చెప్పిన విధమున సత్పురుషుల గుణములు అనంతములు. చందన తరువునకును గొడ్డలికిని యెట్టి సంబంధము కలదో సత్పురుషులకు దుర్మార్గులకు అట్టి సంబంధము కలదు. చూడుము. గొడ్డలి చందనతరువును నరికినను దాని సుగంధమును గొడ్డలికిచ్చును కదా! ప్రాణమును దీసుకొనవచ్చినవానికి సహితము అది సుగంధము నిచ్చును. అందుచేత శ్రీగంధము సర్వజనసమ్మతము. దేవతలు దానిని శిరస్సుపై ధరింతురు. హితవు చేసిన వృక్షమున కపకారము చేయుటవలన గొడ్డలికి వచ్చిన పాట్లు చూడుము. దానిని నిప్పులో కాల్చి సుత్తితో కొట్టుచుందురు కదా. ఈ ప్రకారమే ఖలులు సత్పురుషులకు దుఃఖమునిచ్చెదరు. అయినను సజ్జనులెప్పుడును వారికి ఉపకారమే చేయుచుందురు. దీని ఫలమేమి? సజ్జనులు స్వర్గమునకు పోదురు. అనగా నిరంతర మానందముగ నుందురు. దుర్జనులు నిరంతరము అసంతృప్తితో, దుఃఖముతో కుములుచుందురు. వారలు నరకయాతనల ననుభవించు చుందురు. నిందలు నిష్ఠూరములతో పైకి ఉల్లాసముగా కనిపించినను లోలోన కృశించుచుందురు.

సత్పురుషులు విషయాసక్తులు కారు. సకల గుణశీలసంపన్నులు. ఇతరుల సుఖమును చూచి సంతసించి వారల దుఃఖములను చూచి దుఃఖింతురు. వారు సమదర్శనులు. వారికి శత్రువులు లేరు. వారికి శత్రుబాధలే లేవు. వారు జ్ఞానవిజ్ఞానవైరాగ్య సంపన్నులు. వారల చిత్తములు కోమలములు. దీనులయందు వారికి దయ మెండు. త్రికరణశుద్ధిగా వారు నా పాదములను సేవింతురు.

వారికి మానాభిమానములన్నవి ఉండవు. వారు నిరంతరము పరోపకారము చేతురే కాని స్వార్థమును కలయందైనను కోరరు. వారల ప్రవర్తన సరళము. వారల హృదయములు శీతలములు. వారు త్యాగశీలురు. ఎల్లప్పుడూ వారు సంతోషముగనే యుందురు. వారిలాంటి లక్షణములనెవ్వడు కలిగియుండునో అతడు ఆత్మస్వరూపుడు. ఆత్మస్వరూపుడేమిటి. నేను (భగవంతుడు)వారు, వారే నేను అని గ్రహింపుము. వారలకు దూషణభూషణములు సమానము.

ఇక దుర్జనుల లక్షణాలను చెప్పెదను వినుము. వారల సాంగత్యమును అన్నివిధములా విడిచిపెట్టవలెను. వారల సహవాసము వలన దుఃఖము ప్రాప్తించును. పరుల సంపదలను చూచి వారి హృదయము లెప్పుడును పరితపించును. పరదూషణ వినిన వారు సంపద వచ్చినట్టు తలంచి సంతసింతురు. అరిషడ్వర్గములు వారిని ఆశ్రయించియుండును. ఆశ్రితులు చెప్పినట్లు వారు సంచరింతురు. వారికి దయాదాక్షిణ్యములు శూన్యము. కుటిలులు, కారణము లేకయే పరులతో కలహింతురు. ఉపకారము చేసిన వారితోసహా వారు విరోధించెదరు. వారిమాటలు వారి కార్యములు, వారి బోధనములు, యిచ్చిపుచ్చుకొనుటయు సర్వమూ అసత్యములు. వారి హృదయములు కఠోరములు. నెమలి పైకి చూచుటకు చక్కగా నుండును. దానికేక వినసొంపుగా నుండును. అయిననది పాములను భక్షించును కదా! అటులనే దుర్జనులని తెలిసికొనుము. పరహింసాపరాయణులు, పరదారాసక్తులు, పరనిందారతులు, పాపకర్ములు పాపాత్ములు, మనుజాధములు. వారికి యముని భయములేదు. ఇతరులు అభివృద్ధినొందుట చూచి, విని, పసిపట్టినట్లు వారు తలనొప్పిచే బాధపడుచుందురు. ఇతరుల విపత్తుల జూచి వారు సంతసింతురు. పరుల కష్టములను చూచి దేశమునకు రాజయినట్లు వారు సంతోషింతురు. వారలకు స్వార్థము తప్ప పరోపకారమన్నది స్వప్నమందైనను వుండదు. **వారి హృదయము కామక్రోధాదులకు పుట్టినిల్లు. వీరికి తల్లిదండ్రులని, గురువులని, పెద్దలని, లక్ష్యములేదు. సత్పురుషులన్నను, భగవంతుడన్నను, వారలకు తలనొప్పి వచ్చును. వారు మందమతులు. అవగుణధాములు. కామాంధులు.** వీరిని అధికముగా కలియుగములో చూడవచ్చును. వారు మందమతులు. ఓ

తమ్ముడా! పరోపకారముకంటే ధర్మము మరొకటి లేదు. పరహింసకంటే అధికమగు పాపము లేదు. ఇదియే వేదపురాణముల సారము. ఇదియే సత్పురుషుల మతము. మనుజులై పుట్టి పరహింసచేయువారు నీచయోనులయందు పుట్టి చచ్చుచుందురు. మనుజుడట్లు అజ్ఞానాంధకారమున బడి అనేక పాపములు చేయుచుందురు. ఇట్టివారికి నేను ప్రారబ్ధ కర్మస్వరూపుడనై కాలాంతరమున ప్రత్యక్షమగుచుందును. అట్టివారిని సంసారములో పడత్రోసి వారిని శుభ అశుభ కర్మల ననుభవింపచేయుదును.

ఓ భరతా! దేవతలును మునులును మహాత్ములును శుభాశుభముల నిచ్చునట్టి కర్మలను విడిచిపెట్టి సదా వారు నన్ను భక్తితో భజించెదరు. వారు నిష్కామ్యముగ కర్మల నాచరించెదరు. కామ్య తపస్సులను, కామ్యకర్మలను చేసినయెడల వాటి శుభాశుభఫలములననుభవించుటకు దేహమును ధరించ జీవులు సంసారములోనికి రావలెను. ఏ కర్మలు చేసినను వాటిఫలము నపేక్షింపక వాటి నొనరించినయెడల మనుజునకు జ్ఞానము కలుగును. భక్తిప్రపత్తులు అభివృద్ధిగాంచును. వాటిమూలమున వారు ముక్తిని సామీప్యమున అనుభవించును. ఈ విధముగా సజ్జన దుర్జన లక్షణములను తెలుసుకొనినవాడు సంసారసాగరములో బడి మునిగియుండడు. “తమ్ముడా! అనేక విధములగు సుగుణదుర్గుణములన్నియూ మాయా సంకల్పితములని తెలిసికొనుము. ఈ రెండు గుణములను లక్ష్యము చేయనివాడు సజ్జనుడు. మహాత్ముడు. అతనే ఆత్మస్వరూపుడు. ఈ గుణముల రెండింటికి వశుడగువాడు మూర్ఖుడు. అదియే అజ్ఞాన” మని ఈ ప్రకారము రాముడు తమ్ములకు వివరించెను.”

*(రా. వా. రె. పు. 221/225)*

## సంయోగము

దుర్మార్గులకు ఒక నమస్కారం. సన్మార్గులకు ఒక నమస్కారం అన్నాడు కబీరు. అప్పుడు శిష్యులు సన్మార్గులకు నమస్కారం చేయటంలో ఒక సార్థకత ఉన్నది కాని దుర్మార్గులకు నమస్కారం చేయటంలో ఏమి సార్థకత ఉన్నది? అని ప్రశ్నించారు. అప్పుడు కబీరు దుర్మార్గులకు మీ వియోగం అవసరమని, సన్మార్గులకు మీ సంయోగం అవసరమని నమస్కారం చేయమన్నాడు. అనగా

సాధు పురుషుల సంయోగం, దుష్టుల వియోగం కావాలి. దుష్టులకు దూరంగా ఉండాలి. సాధుపుంగవులకు సమీపంలో ఉండాలి. ఈ రెండింటి ద్వారా మనకు సుఖం లభిస్తుంది. 'సమ్యక్ యోగం ఇతి సంయోగం' ఈ సంయోగం చేతనే నిజమైన యోగం మనకు ప్రాప్తిస్తుంది. కనుక ఇట్టి యోగాన్ని సాధ్యమైనంత వరకు మీరు సాధించి ఆదర్శమూర్తులుగా, ఇతరులకుకూడా బోధించి కీర్తిని సాధిస్తారని నేను ఆశిస్తున్నాను. *(శ్రీ.డి.2001 పు.26)*

## సద్వినియోగము

చేసి చూపించాలి. పరుల తృప్తి కోసం కాదు. మన తృప్తికోసం చేయాలి. చేసిన పని, చెప్పే మాట హృదయసాక్షిగా ఉండాలి.

నేను చెప్పేది నా కోసం కాదు. కేవలం జగత్ కల్యాణం కోసం. జనులసేవ, గ్రామాల సేవ చేస్తుంటే మీ జన్మ సార్థకమవుతుంది. పూర్వపు ఋషులు ఎన్నో విధముల శక్తిని సాధించుకొంటూ వచ్చారు. షేక్స్పియరు గొప్ప నాటక కర్త. అతని నాటకాలు హృదయాన్ని కరగింప జేస్తాయి. అతను మీరు పశుబలాన్ని, రాక్షస శక్తిని ఎంతైనా సంపాదించవచ్చు. కాని, సంపాదించిన బలాన్ని రాక్షసుని వలె ఉపయోగించకండి అన్నాడు. దేహబలాన్ని పుష్టిగా సంపాదించుకోండి. తప్పులేదు. కాని, దానిని రాక్షసుని వలె కాకుండా మానవునివలె వినియోగించాలి. అది నిజమైన బలం. ధనబలం, భుజబలం, బుద్ధిబలం, జనబలం దుర్వినియోగం చేసుకోకూడదు. సద్వినియోగం చేసుకోవాలి. సద్వినియోగం చేసుకోవటానికి మనిషి జన్మ వచ్చింది. దేహమనే పడవకు చిల్లులు పడి శిథిలం కాకముందే గట్టుకు చేరడానికి ప్రయత్నించాలి.
*(వ.1984.పు.104)*

## భగవదన్వేషణ

భగవదన్వేషణలో తొలివిజయం సాధించినట్టిది భారతదేశము. ఇట్టి నైతిక ధార్మిక, ఆధ్యాత్మికములయందు పవిత్రమైన ముందంజవేసి, దిగ్విజయము సాధించి ఆదర్శమునందించి నట్టిది భారతదేశము. కనుకనే త్రిమూర్తి స్వరూపమైన దివ్యత్వమును గుర్తింపచేసే నిమిత్తమై త్రిరాత్రులు, నవరాత్రి,

శివరాత్రి, సంక్రాంతి. అనే మూడు రాత్రులను పవిత్రమైన పర్వదినములుగా చాలాకాలమునుండి ఆచరిస్తూ వచ్చారు భారతీయులు. కనుక పర్వదినములుగా ఏదో ఒక విధమైన ఆహార ఆనందములలో అనుభవించేవి కావనే సత్యాన్ని గుర్తించి, ఆరాధన నిమిత్తమై, ఆత్మాన్వేషణ నిమిత్తమై ఏర్పడినటువంటివిగా సత్యస్వరూపములుగ గుర్తించుట అత్యవసరము. ప్రేమతత్వమును విశాలపరుచుకొని సర్వత్రావ్యాపింపచేసేటువంటి సమత్వమును అనుభవింపచేయు మహాపర్వదినములుగా ఈ పర్వదినములను భావించి, మనలోని దుర్గుణములను దురహంకారములను, దుర్భావములను దుష్టచేష్టలను దూరము కావించుకొని, సద్భావములను సచ్చింతనలను, సత్కర్మలు ఆచరించుటకు ఈ దేహమును సమాజమునకు అంకితము కావించవలెనని ఈనాడు దృఢసంకల్పమునకు మనము పూనుకోవాలి. *(సా. ముందుమాట)*

## ఉత్తమపుత్రుడు

ఉత్తమపుత్రుడున్నప్పుడు తన కుటుంబమే కాక, వంశమునకు కూడా చక్కని గౌరవమర్యాదలు చేకూర్చుకుంటాడు. ఒక పరిమళ వృక్షము వనమున ఉన్నప్పుడు వనమున కంతటికి పరిమళాన్ని అందిస్తూ ఉంటుంది. అదే వనమునందు ఒక చెట్టు తొఱ్ఱలో అగ్ని ప్రవేశించినప్పుడు ఆ చెట్టును కాల్చడమే కాకుండా వనమును కూడా కాల్చివేస్తుంది. కనుక వంశమునందు **దుష్టపుత్రుడు పుట్టినపుడు మంచి వారికి, చెడ్డవారికి అపకీర్తి కలిగిస్తాడు. మంచిపుత్రుడు జన్మించినపుడు తన వంశమునకు తన గృహమునకు, తనతోటి వారికి కూడా సత్కీర్తి నందిస్తాడు**. ఈనాడు గుణవంతుడైన పుత్రుని కనటము, పోషించటము జగత్తునకు అందించటము అత్యవసరము. ఇది ఎవరి బాధ్యత? తల్లి తండ్రులది, అధ్యాపకులది కూడా. *(స.సా.అ.89 వెనుక కవురు పుట)*

ధనం కోసం పరులకు అపకారం చేయడం అన్యాయ, అక్రమ, అనాచారములకు పాల్పడటం, లేని చెడ్డను సృష్టించి పవిత్రమైన, నిత్యమైన సత్యమునకు విరుద్ధంగా ప్రచారం చేయడం – ఇది ఆనాడే కాదు. ఈనాడూ జరుగుతూనే ఉన్నది. ఇది లోకసహజం. దీనికి ఎవ్వరూ వెరువకూడదు. మనలో

లేని దోషాలకు మనమెందుకు భయపడాలి. మనలో లేని తప్పులకు మనమెందుకు వెఱవాలి? సత్యనిత్యమైన భావములచేత ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన దివ్యపురుషులకు విరుద్ధంగా దుర్మార్గులు, అసూయాపరులు **దుష్ప్రచారం చేయడం అనాదికాలము నుండి జరుగుతూనే ఉన్నది.** ఈనాడు కూడా అలాంటి దుష్ప్రచారాల కేమీ తక్కువలేదు. సాయియొక్క పేరుప్రతిష్ఠలు దినదినమునకూ పెరిగిపోవడం చూసి అనేకమందికి అసూయ కల్గుతోంది. పోనీ, వారేమైనా మంచి పనులు చేస్తున్నారా అంటే, కనీసం ప్రయత్నమైనా చేయడం లేదు.

ప్రఖ్యాతి గాంచిన రాయలసీమకు బ్రిటిషువారి కాలమునుండి ఒక్కరైనా త్రాగునీరు అందించలేకపోయారు. ఎంతమందో శ్రీమంతులు, నాయకులు ఉండినారు. కాని, ఒక్కరైనా ఈ మంచి కార్యమునకు పూనుకోలేదు. మనిషికి నీరే ప్రాణం కాబట్టి, ఇంటింటికీ నీరు అందించారు సాయిబాబా. ఈనాడు ఒక హార్ట్ ఆపరేషన్ చేయించుకోవాలంటే లక్షల రూపాయలు కావాలి. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను కట్టించి లక్షలాదిమందికి ఉచితంగా హార్ట్ ఆపరేషన్లను చేయిస్తున్నారు సాయిబాబా. ఈరోజుల్లో పసిపిల్లవానిని స్కూల్లో చేర్చాలంటే మొట్టమొదట 20 వేల డొనేషన్ కట్టాలి. కాని, సాయిబాబా కె.జి. మొదలు పి.జి వరకు ఉచిత విద్య నందిస్తున్నాదు. ఇందులో వేయింట ఒక భాగమైనా ఎవరైనా చేస్తున్నారా? **ఏ గవర్నమెంటు అయినా విద్యను, వైద్యమును ఉచితంగా అందిస్తున్నదా? లేదు. లేదు. ఒక్క సత్యసాయిబాబా మాత్రమే స్వార్థమనేది లేకుండా పరార్థం కోసం పాటుపడుతున్నాదు. కాని, అయోగ్యులైన మానవులు కొందరు సాయికి విరుద్ధంగా దుష్ప్రచారమును ప్రారంభించారు.** సాయి చేస్తున్న పనులెలాంటివి, అనే జ్ఞానం వారికి లేకుండాపోతున్నది. మహా అల్పజ్ఞులైపోతున్నారు. ఈ విద్యావంతులంతా సాయిది చాలా పవిత్రమైన హృదయం, నిర్మలమైన భావం, నిస్వార్థమైన ప్రేమ–పవిత్రత–పట్టుదల ఈ మూడు పి లు సత్యసాయి బాబాలో ఉన్నాయి. ఈ మూడింటిద్వారా స్వార్థరహితసేవ చేస్తున్నారు సత్యసాయిబాబా. సత్యసాయిబాబాలో కాలిగోటి నుండి తలవెంట్రుక వరకూ ఎక్కడా స్వార్థమనేది లేదు. తలలున్నవారు ఇంత మాత్రం యోచించుకొనలేరా? **ఎందుకోసం వీరి దుష్ప్రచారములు ధనంకోసమే.**

**ఈ దుర్బుద్ధులంతా ధనం కోసమే, ఈ దురాలోచనలంతా ధనం కోసమే.** ఇంతేకాకుండా డబ్బులు ఇచ్చి ఒక మతము నుండి మరొక మతములోకి మార్పిడి చేస్తున్నారు. కాషాయ వస్త్రములను ధరించిన స్వాములు కూడా ఒకరి గురించి మరొకరు దుష్ప్రచారమునకు పాల్పడుతున్నారు.

“కాషాయ వస్త్రంబు కట్టిన మాత్రాన
కరతలామలకంబు కాదు ముక్తి
నోటితో మంత్రంబు నుచ్చరించినయంత
చేసిన పాపంబు చెదిరిపోదు
గీతను చేబట్టి కేకలు వేసిన
పుణ్యము మన ఇంట ప్రోవుపడదు”

కొందరు స్వాములు కూడా దుర్మార్గంలో ప్రవేశించి దుష్ప్రచారం చేస్తున్నారు. ఇంక, పీఠాధిపతుల సంగతి చెప్పనక్కర్లేదు. ఎవ్వరినీ మనం విమర్శించకూడదుగాని, సమయం వచ్చింది కాబట్టి, చెబుతున్నాను. ఈ దుష్ప్రచారం గురించి మీరు ఎలాంటి భయమూ పెట్టుకోకండి. బలహీనతకు లోనయ్యేవారు భక్తులు కాజాలరు.

ఇప్పుడు బెంగుళూరులో కూడా 300 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కడుతున్నాము. ఇలాంటి పవిత్రమైన కార్యంలో ఏ నాయకుడైనా ప్రవేశిస్తున్నాడా? లేదు. పైగా గొప్పలు చెప్పుకుంటూ కూర్చున్నారు. సిగ్గుచేటు! కొందరు అసూయతో దుష్ప్రచారానికి పాల్పడు తున్నారు. ఇతరులు చేసే పవిత్రకార్యాలకు అసూయతో అడ్డు తగిలేవారు రాక్షసులేగాని మానవులు కారు. ఇలాంటి రాక్షసులు లోకమంతా బయల్దేరినా సాయి ప్రతిజ్ఞ ఎప్పటికీ మారదు. అసూయాపరులు దుష్ప్రచారం చేత సాయిబాబా గౌరవమును తగ్గించాలని ప్రయత్నం చేస్తున్నారు. నాకు గౌరవం కావాలనే ఆశ లేదు. కాని, అది పెరుగుతూనే ఉంది. మన భారతదేశమంత అక్షరాలతో ఈ ప్రపంచమంతా ప్రచారం చేసినా నా గౌరవం కించిత్తైనా తగ్గిపోదు. దుష్ప్రచారం చూసి కొంతమంది భక్తులు బలహీనతకు లోనవుతున్నారు. వారు

సరియైన భక్తులు కారు. సాయిశక్తులను ఇన్ని గమనించికూడను ఈ పిచ్చిపిచ్చి కాకికూతలకు ఎందుకు భయపడాలి. గోడలపై వ్రాసే వ్రాతలను, వేదికపై వేసే కేకలను, పేపర్లలో వ్రాసే బూతు కూతలను మీరు లెక్కచేయనక్కరలేదు.. మనసత్యాన్ని, మన ధర్మాన్ని మన ప్రేమను మనం ప్రచారం చేస్తూ రావాలి.

*(స.సా.జ.2001పు 1/31)*

## సత్యాన్వేషణ

అనాదికాలము నుండి సత్యాన్వేషణ నిమిత్తమై అనేకమంది మహర్షులు, మహనీయులు పాధనలు సల్పుతూ వచ్చారు. పవిత్రమైన భావమును, విశిష్టమైన విశ్వాసమును, దృఢసంకల్పమును ఉంచుకొని సత్యాన్ని దర్శించే వరకు తమ దీక్ష వీడమని అనేకమంది మహర్షులు తపస్సు చేశారు. కొంత కాలమునకు వారే ప్రజలలో ప్రవేశించి, “ఓ ప్రజలారా! మేము భగవంతుని ప్రత్యక్షంగా చూడగలిగాము. ఆ భగవంతుడు తేజమయుడు. దివ్యమైన ప్రకాశముతో ఉన్నాదు. అజ్ఞానమనే తమోగుణమునకు ఆవల నున్నాడు. భగవంతుడు ఎక్కడో దూరముగా లేడు. మేము ఎక్కడో బయట వెతకలేదు. మృణ్మయమైన ఈ దేహమందే ఆ చిన్మయమూర్తిని మేము చూడగలిగాము” అన్నారు. కనుక దేహమును సామాన్యమైనదిగా భావించరాదు. *(ద.స.98పు.3/4)*

సత్యాన్వేషణ అంటారు. ఏమిటి అన్వేషణ? అయితే సత్యము సర్వత్రా ఉంటున్నదే. దీనికి ఒక ఉదాహరణము మన కన్నులు అమ్మను చూస్తుండాలి. అదే కన్నులు బిడ్డను చూస్తుంది. అదే కన్నులు భార్యను చూస్తుంది. అదే కన్నులు వంట మనిషిని చూస్తుంది. అయితే తల్లిని చూచే సమయంలో ఏ మనసుతో చూడాలి? భార్యను చూచే సమయంలో ఏ తలంపుతో చూడాలి. ఇదియే సత్యాన్వేషణ. వీరు నలుగురు ఆడవారే. చూచేది కన్నులు ఒక్కటే. కాని ఎవరిని ఏదృష్టితో ఏ భావంతో చూడాలన్నదే సత్యాన్వేషణ. అదేవిధముగనే నాలుక ఉన్నది. అసత్యమాడేది. సత్యమాడేదే ఒక నాలుకే. పరులను దూషణ చేసేది, భూషణ చేసేది ఒక నాలుకే. అయితే ఒకే నాలుక అయినప్పుడు ఎవరిని దూషించాలి? ఎవరిని భూషించాలి? ఎవరిని ప్రేమించాలి? ఎవరిని ఆరాధించాలి? అనేటటువంటిదే సత్యాన్వేషణ. ‘సత్యాన్వేషణ’ అనగా

అన్నింటియందూ ఉన్నది సత్యము. పదార్థానికి తగిన ప్రయోగమే సత్యము. వెన్న ఉన్నది వ్రేలితో కొట్టవచ్చు. ఇనుము ఉన్నది సుత్తితోనే కొట్టాలి. పదార్థానికి తగిన ప్రయోగమే సత్యాన్వేషణ. ఇనుమును వ్రేలితో కొడితే వ్రేలు కూడా తెగిపోతుంది. వెన్నను సుత్తితో కొడితే ఛిన్నాభిన్నమై పోతుంది. దేనికి ఏవిధమైన దానిని ఉపయోగించాలి అన్నదే సత్యాన్వేషణ. కనుక సర్వత్రా ఉండిన దైవత్వాన్ని అన్వేషణ చేయడమంటే మనలో భావమార్పురావాలి. దైవభావమును మనలో ఆవిర్భవింపచేసుకొన్నప్పుడే సర్వుల యందు కూడనూ ఏకాత్మ భావాన్ని మనం దర్శించవచ్చు. *(శ్రీ.ఏ. 1995 పు. 34/35)*

## సత్సంగము

సత్సంగములనే పవిత్రత్వము అనుభవముతో అర్థమవుతుంది కానీ, కేవలము మాటలతో అర్థముకాదు. ఉన్నతస్థాయికి పోవుటకు కానీ, అధమస్థాయికి దిగజారుటకు కానీ సంగమే కారణము. సంగమనగా స్నేహము. ఇసుక, గాలితో స్నేహముచేసి గగనము వరకు ఎగిరిపోతుంది. అదే ఇసుక నీటితో చేరి గుంట లోపలకు దిగిపోతుంది ఆకాశమున కెగురుటకు ఇసుకకు రెక్కలు లేవు. క్రింద గుంటకు దిగుటకు కాళ్ళు లేవు. పైకి పోవుటకు కానీ క్రిందికి దిగజారుటకు కానీ అది గాలితోను నీటితోను చేసిన స్నేహమే కారణము. ఇనుమును మట్టిలో వేసినపుడు త్రుప్పుపడుతుంది. దానియొక్క శక్తిని కూడను కోల్పోతుంది. అదే ఇనుమును అగ్నిలో వేసినపుడు అది తనయొక్క రూపమును మార్చుకుంటుంది. మెత్తదనమును చేకూర్చుకుంటుంది. తనలో ఉన్నటువంటి మాలిన్యమును కూడను పోగొట్టుకుంటుంది. అట్టి పరిస్థితులకు అది మట్టితోను, అగ్నితోను చేసిన స్నేహమే కారణము. కనకనే, మానవునికి సత్సంగమనేది చాలా ప్రధానమైనది. శంకరాచార్యులు చెప్పారు.

జీవన్ముక్తికి సత్సంగమే ప్రథమ సోపానము.

*(ఆ.రా.పు. 81/82)*

## జీవన్ముక్తి

సత్సంగముచే సహజ విరక్తి
ఆవిరక్తిచే విగత భ్రాంతి

భ్రాంతి తీరితే శాంతి స్థిమితము
స్థిమితి శాంతిచే జీవన్ముక్తి ॥ భజ గోవిందం ॥ *(సుబోధ – పు. 90)*

"జన్మచేత జనులు పరిశుద్ధ హృదయులే
పాడుచేయుచుండె పరిసరములు
అంతరాత్మ బోధ ఆలకించుడు మీరు
సమత మమత మనుజు హక్కుకాదె!

***ప్రేమస్వరూపులారా!***

జన్మించినప్పుడు మానవుని హృదయము నిర్మలంగా నిశ్చలంగా నిస్వార్థంగా ఉంటుంది. క్రమక్రమేణ పరిసరముల వాతావరణము, స్నేహితుల సంబంధం ఇత్యాది గుణముల చేత తన సౌశీల్యమును మానవుడు పోగొట్టుకుంటున్నాడు. ఈ లౌకిక సంబంధబాంధవ్యముల చేత మానవుడు తన హృదయమును కలుషిత గావించుకుంటున్నాడు. మానవుడు చెడిపోవ టానికి గాని, బాగుపడుటకుగాని పరిసరముల ప్రభావం పైననే ఆధారపడి ఉంటుంది. దీనిని పురస్కరించుకొనియే మనం ఎట్టివారి సంఘముతో సంచరిస్తామో, వారి యొక్క ప్రభావం మన మీద పడుతుంది. కనుక మానవుడు మంచి సంఘమును కోరుకోవాలి. ఇలాంటి మంచి సంఘములో చేరినప్పుడు మానవుడు ఉన్నత స్థితికి చేరుకుంటాడు. కనుక ఈనాడు మానవుడు తన సంకల్పం, సంపర్కముల చేతనే చెడిపోవటంగాని, బాగుపడడంగాని జరుగు తున్నది.

లోకంలో జన్మత: అంతా మంచివారే. కాని ఈ చెడు స్నేహములచేతనే మానవుడు తన జీవితాన్ని పాడుచేసుకుంటున్నాడు. ఈనాడు మంచిచెడ్డలను గురించి ఏమాత్రం విచారించటంలేదు. కాన మంచి చెడ్డలను సరిగా విచారించి మంచివారితో స్నేహం చేస్తుండాలి. మన సర్వేంద్రియములు మనకు హస్తగతం కావాలనుకున్నప్పుడు సత్సంగంలో చేరాలి. 'సత్' అనగా శాశ్వతము. ఈ జగత్‌లో ఏది శాశ్వతము? అన్నియూ అశాశ్వతములే. ఒక్క దైవత్వం మాత్రమే శాశ్వతము. కనుక అట్టి శాశ్వతమైనటువంటి దైవ సంబంధాన్ని మనం

కల్పించునప్పుడే మన భావములు శాశ్వతమైనటువంటివిగా, ఉత్తమమైనటు వంటివిగా, ఆదర్శవంతమైనటువంటివిగా అమృతతత్త్వమైనటు వంటివిగా, అమరత్వమైనటువంటివిగా రూపొందుతాయి. కనుక మొట్టమొదట సంఘ దోషము వలన మనం చెడిపోతున్నామనే సత్యాన్ని గుర్తించటం అత్యవసరం.

*(శ్రీ.ఫ.2000 పు. 7)*

సత్సంగమనగా ఏమిటి? ఏదో కొంతమంది సత్పురుషులతో చేరి ఆధ్యాత్మిక విషయాలను, భగవతతత్త్వమును సంప్రదించడమే సత్సంగముగా మీరు భావిస్తున్నారు. కానీ, అది కాదు సత్సంగము.

'సత్ – అనగా దైవం. కనుక, దైవముతో చేరడమే సత్సంగము. అంగములోని జంగము, జంగములోని సంగము. సంగములోని లింగము. ఆ లింగమే ఆత్మస్వరూపం. అంగములోని జంగమే జీవితత్త్వము. జంగములోని సంగమే సత్యధర్మ శాంతి ప్రేమల సంగము. ఆ సంగములోని లింగమే ఆత్మస్వరూపం. కనుక, దైవంతో కూడుకున్నదే సత్సంగము. సత్– దైవత్వం, చిత్ – జీవత్వం. ఈ రెండింటి ఏకత్వమే ఆనందము. జీవబ్రహ్మ ఐక్యాను సంధానమే ఆనందము. అందరూ ఆనందం కావాలని ఆశిస్తున్నారు. కానీ ఎక్కడ లభిస్తుంది ఆనందం? దండిగా ధనం సంపాదించవచ్చు కానీ, దానితో ఆనందం వస్తుందా? ధనమునకు ఏ ప్రమాదం సంభవించునో అనే భయం వస్తుందిగాని, ఆనందం రాదు. మీరు సర్వవిధముల కీర్తిని సంపాదించవచ్చు. కానీ కీర్తివల్ల కలిగే ఆనందం ఆనందం కాదు. అదంతా తాత్కాలికమైన ఆనందం. మీరు గొప్ప బిరుదులు అందుకోవచ్చు. కానీ ఈ బిరుదులన్నీ వచ్చిపోయేవే. ఏది మీ నిజమైన బిరుదు? "శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్ర:' అన్నది వేదం. కనుక, మీరు ధనంకోసం, పేరు ప్రతిష్ఠల కోసం ప్రాకులాడవద్దు. దివ్యమైన ఆనందంకోసం ప్రాకులాడండి. కానీ, ఈనాటి మానవుల పరిస్థితి ఏవిధంగా ఉన్నది?

ధనము కోసం దైవధ్యానాలు బోనాల
కోటి పన్నాగాలు పన్నేరయా

భూమి సూర్యునిచుట్టు జనులు ధనముచుట్టు
గిరగిరా తిరుగుచుంటారయా

శాశ్వతమైన ఆనందం దైవ ప్రేమవల్లనే ప్రాప్తిస్తుందిగాని, ధనం వలన లభించదు. దైవ ప్రేమను పొందుటయే ఆనందము. అట్టి దైవత్వాన్ని పొందే నిమిత్తమై సత్సంగంలో చేరాలి. అదియే మాణిక్యవాచికర్ చేసిన జ్ఞానబోధ. *(సా.పు. 71/73)*

**సత్సంగం పామరులను పావనులుగా మారుస్తుంది.** *(ము.ము.పు. 37)*

## ప్రవృత్తిని నివృత్తిగా మార్చాలి

భగవంతుడు మీకు ప్రసాదించిన మతిని, గతిని, స్థితిని, సంపత్తిని సద్వినియోగపరచుకోవాలి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాదులు మీకు భగవంతుడు అందించినవి కావు; మీ ఆహార విహారముల చేత ఏర్పడినవి. ఇవన్నీ ప్రవృత్తి లక్షణాలు. ఉద్యోగాలు చేయటం, పదవులు నేలటం, ధనమును సంపాదించటం ఇవన్నీ ప్రవృత్తి లక్షణాలే. ఇవి తలనుండి ఆవిర్భవిస్తున్నాయి; ఏనాటికైనా మారిపోతాయి. కాని, హృదయం నుండి ఆవిర్భవించే నివృత్తి లక్షణాలు శాశ్వతమైనవిగా, స్వచ్ఛమైనవిగా, యుక్తమైనవిగా, సరళమైనవిగా ఉంటాయి. ఇలాంటి నివృత్తి లక్షణాలను మీ ముందే పెట్టుకొని వాటిని మూసిపెట్టి, మీరు ప్రవృత్తి కోసం ప్రాకులాడుతున్నారు. ప్రవృత్తి కోసం ప్రాకులాడటం చేతనే మీకు సద్గతి ప్రాప్తించటం లేదు. చేసేవన్నీ ప్రవృత్తి పనులు, ఆశించేవి మాత్రం నివృత్తి ఫలితాలు! ఇదెలా సాధ్యం? ప్రవృత్తిని నివృత్తిగా మార్చుకోవాలి. ప్రవృత్తి మార్గంలో ఎంత ప్రయత్నించినా మీకు శాంతి లభించదు. *(స.సా ॥ జనవరి 2001 పు 15)*

## పరివర్తన రావాలి!

మిమ్మల్ని సరిదిద్దడానికి అప్పుడప్పుడు నేను కోపం నటిస్తాను కాని నిజంగా నాకు కోపం లేదు. కోపం వచ్చినప్పుడు ఏ తిట్టు తిడతాను? “దున్నపోతా!” అంటాను అంతే! అదే నా తిట్టు. నీవు మంచి కార్యాలు చేయకపోతే నిజంగా నీవొక బఫెలో (దున్నపోతు) అనే చెప్పవచ్చు. మంచి

పనులు చేసినప్పుడే నీవొక గుడ్‌ఫెలో (మంచివ్యక్తి) అవుతావు. ఈనాడు అందరూ దున్నపోతులుగానే ఉంటున్నారు. కారణమేమిటి? మంచి పనులు చేయటం లేదు. వర్షం కురిసినప్పుడు ఆవులు దూడలు పరుగెత్తుతాయి. కాని, దున్నపోతు పరుగెత్తదు. ఉన్నచోటే తడుస్తూ ఉంటుంది. మీరు దున్నపోతులు మాదిరి తయారు కాకూడదు. **మీలో పరివర్తన రావాలి. నేను అందరినీ ప్రేమిస్తాను**. ప్రేమయే నా స్వరూపము. ప్రేమయే నిజమైన శక్తి. నేను నా ప్రేమను అందరికీ ఏ రీతిగా పంచుతున్నానో మీరు నా అంశమే కనుక మీరు కూడా మీ ప్రేమను అందరికీ పంచండి. అప్పుడు నేను చేసినదే మీరు చేసిన వారౌతారు. అప్పుడు మీరు కూడా భగవత్స్వరూపులే! ఇట్టి పవిత్రమైన భావాన్ని మీరు అనుసరించినప్పుడు జగత్తంతా నిత్యకళ్యాణం, పచ్చతోరణంగా వర్థిల్లుతుంది.

*(స.సా.ఆ. 2000 పు. 232/233)*

## రాజ మార్గము

ఈ జీవితాన్ని ఇతరుల సేవకై అంకితం చేయండి. ఇతరులు అంటే మీ లోపల ఉన్న భగవంతుని ప్రతిరూపాలే. మానవుడు భగవంతుణ్ణి చేరే పురాతనమైన రాజమార్గం పాడయిపోయింది. ఆ మార్గాన్ని మరమ్మత్తులు చేయడానికే నేను వచ్చింది. నిజాయితీగల ఆలోచనాపరులుగా, ఇంజనీర్లుగా, పనివాళ్లుగా తయారై నన్ను చేరండి. వేదములు, ఉపనిషత్తులు, శాస్త్రములే నేను చెప్పిన మార్గము. దానిని అందరికీ ప్రకటించి సంస్కరించడానికే నేను వచ్చింది" అన్నారు భగవాన్.

*(ప. 61-62 పు. 182)*

**శుభం**

# సాంగత్యము

విడువుమయ్య దుర్జనుల సాంగత్యము తమ్ముడా !
వదలవయ్య కామక్రోధాదులు
సకలగుణ సంపన్నుడైన
పరమాత్ముని సేవింపుమయ్య ॥
జ్ఞానవిజ్ఞాన వైరాగ్య సంపన్నుడైన
ఆత్మస్వరూపుడే పరమాత్ముడని
గ్రహియింపుమయ్య తమ్ముడా ॥
అట్టి సత్పురుషుల సాంగత్యమే మేలు నీకు
విడుమయ్య దుర్జనుల సాంగత్యము తమ్ముడా ॥
విహరించుమయ్య సదా భగవద్భజనలో తమ్ముడా ॥

# పారదోలుము

పారదోలుము నీ హృదయమందు
వసించు అరిషడ్ వర్గములను
నవవిధభక్తి మార్గధ్యాన సాధనలతో
అర్పింపుము నీ హృదయ కమలమున్
స్వామికి పరిపూర్ణ ప్రేమతో
కొలువుము నీ హృదయాంతరంగమున
నివసించు రమణీయ సుందరసాయిని
పాడము ప్రేమతో శ్రీ సత్యసాయి సత్ చరిత్ర.

**తూములూరు కృష్ణమూర్తి**

# సంప్రదించిన పుస్తకములు

| పుస్తకము పేరు | సంకేతాక్షరం |
|---|---|
| 1. ఆత్మారామము | ఆ.రా. |
| 2. గీతావాహిని | గీ. |
| 3. దసరా యజ్ఞ సప్తకం | ద. |
| 4. ధ్యాన వాహిని | ధ్యా.వా. |
| 5. ప్రేమ వాహిని | ప్రే.వా. |
| 6. ప్రశ్నోత్తర వాహిని | ప్ర |
| 7. బృందావనంలో త్రయినాదం | బృ.త్ర. |
| 8. భగవద్గీత | భ.గీ. |
| 9. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి వేసవి ప్రబోధలు 1973 | శ్రీ.స.ప్ర |
| 10. భాగవతవాహిని | భా.వా. |
| 11. మూఢమతి – ముక్తమతి | ముము. |
| 12. రామకథా రసవాహిని | రా.వా. |
| 13. లోకనాథ సాయి | లో. |
| 14. వచనామృతం | వ. |
| 15. శ్రీ భగవాన్ ఉవాచ | శ్రీ భ.ఉ. |
| 16. శ్రీవాణి | శ్రీ |
| 17. శ్రీ సాయి గీత | శ్రీ.సా. |
| 18. శ్రీ సత్యసాయి దివ్య లీలామృతం | శ్రీ.స.ది.లీ. |
| 19. సత్యం శివం సుందరం | స. |
| 20. సనాతన సారథి | స.సా. |
| 21. సాయి దర్శన్ | సా. |
| 22. సుధా బిందువులు | సు. |

# సత్సంగము



సంకలనము

**తూములూరు కృష్ణమూర్తి**

# సత్సంగము

*సంకలనము:*

**తూములూరు కృష్ణమూర్తి**
'అనసూయ' సి–66,
దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలనీ,
హైదరాబాద్ – 500 007.
ఫోన్: 040–27427083, టెలీఫ్యాక్స్: 27428904
సెల్‌ఫ 9391087255, 9849384829
E-mail: tkm_hyderabad@yahoo.co.in
mrtumuluruk@gmail.com

*ప్రచురణ:*
**శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్**
**శివం, శివం రోడ్**
**హైదరాబాద్ – 500 044.**
**ఫోన్: 040–27654545**

*వెల:* **రూ. .**

*ముద్రణ:*
**విప్ల కంప్యూటర్ సర్వీసెస్**
(డిజైనర్స్ & మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్)
నల్లకుంట, హైదరాబాద్– 500 044
ఫోన్: 27654003, 27677078, 27676910
E-mail: viplavision@gmail.com

# ముందుమాట

మానవుడిని 'అమృతస్య పుత్రః' అన్నారు. నిజతత్వాన్ని గుర్తించుకొనలేక 'అనృతపుత్రుడు' గా మారిపోతున్నాడు. కారణము మానవుడు దుస్సంగములో చేరి దురాలోచనలకు, దుర్భావములకు, దుర్మార్గములకు అలవాటు పడి, దుర్వ్యసనాలతో, దుష్టచేష్టలకు అలవాటుపడి, దుర్గుణములను అలవర్చు కొంటాడు. వాటితోపాటు దుర్బుద్ధులు, దుష్ట సంకల్పములు వస్తాయి. వాడు దుష్టుడై, దుష్ప్రచారములు చేస్తూ దుష్టపుత్రుడై దైవానికి దూరం అవుతాడు. వీటికి అరిషడ్వర్గములు కారణము. మనస్సుచేత ఇంద్రియములను స్వాధీన పరచుకోవాలి. మనస్సు నాశనం కాదు. కనుక ఆత్మలో లీనం చేయాలి. నదులు సముద్రములో కలుస్తున్నవి. అదే రీతిగా మనస్సు పరమాత్మలో లయం చేయాలి. ప్రశాంతత ఏర్పడును. తన్ను తానే ఉద్ధరించుకోవాలి. తానెవరో తెలుసుకోవాలి. దానికి సత్సంగములో చేరితే, సత్ప్రవర్తన, సత్యనిరతి, సద్బుద్ధి, సద్గుణాలు అలవర్చుకోవచ్చు. వానివలన అతడు ఉత్తమ పుత్రునిగా, సత్పురుషునిగా మారి సదాలోచనలతో తల్లితండ్రులకు, దేశానికి సేవచేయగల్గుతాడు. అతనిలోని అరిషడ్వర్గములు, సన్నగిల్లి, సద్భావముల వలన కుటిలత్వము,దురాశ, ఆడంబరత్వము, అహంకారము,అసూయ, ద్వేషము అణిగి ధర్మబద్ధముగా జీవించుచూ ఇతరులను ప్రేమిస్తూ సంఘానికి ఉపకరిస్తాడు. "విజయదశమి నాడు యుద్ధంలో ఉపయోగించే కత్తీ కటారులకు ఆయుధపూజ చేస్తారు. మానవుని దగ్గరున్న కామ క్రోధ లోభ మోహ మదమాత్సర్యాలనే ఆయుధాల్ని కూడా అదే విధంగా పూజించాలి అంటారు భగవాన్ బాబా. వాటిని భగవంతుని వైపుకు మరలించటమే వాటిని పూజించటం. ఆ ప్రభువు వైపుకు త్రిప్పేసరికి ఆ దుర్గుణాలు సుగుణాలుగా మారిపోతాయి.

కామము అంటే తీవ్రమైన కోరిక. దానిని భగవంతుని వైపు మరల్చు. అప్పుడది భగవంతుణ్ణి దర్శించాలని, ఆయనను ప్రసన్నం చేసికొనాలని, ఆయన అనుగ్రహం పొందాలని తపించిపోతుంది. అప్పుడు కామము కాంక్షగా మారిపోతున్నది. క్రోధము అంటే కోపం. దానిని భగవంతుని వైపుకు త్రిప్పు. భగవానుడు ఇంకా రాలేదే. ఎన్నాళ్ళు నేను ఎదురు చూడాలి? నాలో ఏమి తప్పున్నది? ఎందుకు నన్ను అనుగ్రహించడు అని ఆయనపై పంతం పట్టు. ఆ క్రోధం పట్టుదలగా మారుతున్నది. లోభము అంటే పిసినారితనము. ఆ లోభ గుణాన్ని భగవంతునివైపు

మరల్చు. భగవంతుడు నా వాడు. నాకే చెందినవాడు. అయన నా ప్రభువు. నేను ఆ ప్రభువుకు చెందినవాడను అని అలమటించిపోతుంది. అప్పుడు ఆ లోభగుణము ఆర్తిగా మారుతున్నది.

మోహము అంటే వివేకం కోల్పోవటం. దానిని భగవంతుని వైపుకు త్రిప్పు. భగవంతుడు లేకపోతే నేను బ్రతకలేను. అయన తోడిదే నా లోకము అని ఎవరి మాట వినకుండా ఎవరినీ లెక్క చేయకుండా పిచ్చి దైపోతుంది మనస్సు. అంటే ఆ మోహము మూఢభక్తిగా మారుతున్నది.

మదము అంటే గర్వము. దానిని భగవంతుని వైపు పోనివ్వు. నాకు భగవంతుని అండ ఉన్నది. నన్నెవ్వరూ ఏమీ చేయలేరు. నాకేమీ భయము లేదు. భగవంతుడు నన్నెందుకు వదిలిపెడతాడు? అనే భావాలతో మదము విశ్వాసంగా మారిపోతుంది. మాత్సర్యము అంటే అసూయ. దానిని పరమాత్ముని వైపు ప్రసరింపచేయి. నా స్వామి, నా ప్రభువు వేరొకరి వాడవుతున్నాడే, నాకు దూరమవుతున్నాడే అని అరాట పడిపోవటము వల్ల ఆ మాత్సర్యము తపనగా మారిపోతుంది.

"సర్కస్‌లో సింహాలు వాటి మాస్టర్ చెప్పినట్లుగా వింటాయి. అలాగే అరిషడ్వర్గాల్ని కూడా వాటి అధిపతికి అప్పజెప్పినప్పుడు అవి వాటివాటి తీవ్రతలను వదిలిపెట్టి సాత్వికంగా మారిపోతాయి. అదే ఆయుధపూజ అంటే" అని అన్నారు భగవాన్ బాబా. *(తపోవనము పు 92/93)*

శివరాత్రి, నవరాత్రులందుండు అంతరార్థము గ్రహించి హృదయము విశాలపర్చుకొని సమాజమునకు అంకితము కాగలడు.

మానవుడు భగవదన్వేషణ, సత్యాన్వేషణల ద్వారా, మృణ్మయమైన దేహము నుండే ఆ చిన్మయమూర్తిని దర్శించటానికి ప్రయత్నము చేయగల్గుతాడు. ఇందు భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు చెప్పిన కొన్ని విషయములను వివరించటమైనది. అందరము వీటిని అర్థము చేసుకొని మన జీవితములను దైవచింతనలో ఆత్మానందము పొందుటకు ప్రయత్నిద్దాము.

**'సమస్తలోకాస్సుఖినోభవంతు'**

హైదరాబాదు **తూములూరు కృష్ణమూర్తి**

తేది: ఫిబ్రవరి, 2009



మానస భజరే గురుచరణం

దుస్తరభవ సాగర తరణం

గురు మహరాజ్ గురు జై జై

సాయినాథ సద్గురు జై జై

ఓం నమశ్శివాయ ఓం నమశ్శివాయ

ఓం నమశ్శివాయ శివాయనమ ఓం

అరుణాచలశివ అరుణాచలశివ

అరుణాచలశివ అరుణశివోం

ఓంకారంభవ ఓంకారంభవ

ఓంకారంభవ ఓం నమో బాబా ॥